ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం. ప్రతి పేదవాడికి స్థలం ఇచ్చి పక్కా గృహం నిర్మించే బాధ్యత ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేలు, వైసీపీ నేతల వరకు జోరుగా డప్పు కొట్టారు. ప్రజలు సైతం సొంతింటి కల నెరవేరుతుందని నమ్మి సంబరపడ్డారు. కానీ చేసిందేమీ లేదని కేవలం పాలకుల మాటలు గాలిమాటలేనని తేటతెల్లమయ్యాయి. ఇదంతా జగన్మాయ అని అర్థమైంది. ఇంటి పట్టాలు పంపిణీ చేశారే కానీ స్థలాలు ఎక్కడున్నాయో చూపించడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరికి కొండలు, గుట్టల్లో స్థలాలు కేటాయించడంతో ఇటువంటి చోట ఇల్లు ఎలా కట్టాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో స్థలాల రిజిస్ట్రేషన్‌కు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఒత్తిడి చేస్తున్నారని, ఓట్ల కోసమే ప్రభుత్వం ఈ ప్రక్రియను ప్రారంభించిందని ప్రతిపక్ష పార్టీలు, నాయకులు విమర్శిస్తున్నారు.

అంతా జగన్మాయ..!

- స్థలం చూపించకుండానే రిజిస్ట్రేషన్‌కు ఒత్తిడి
- గుట్టలు, కొండల్లో స్థలాలు కేటాయింపు
- ఎన్నికలు సమీపిస్తుండడంతో రిజిస్ట్రేషన్ల హడావిడి
- నిజమైన అర్హులకు దరిచేరని సంక్షేమ ఫలాలు



జగనన్న కాలనీలో బండమీద ఇంటి స్థలం కేటాయించిన దృశ్యం

ఇప్పుడు కడితే బిల్లులు ఎలా..



ఇంటి స్థలం మంజూరైందని ఇంటి పట్టా పంపిణీ చేశారు. ఇప్పటి వరకు ఇంటి స్థలం చూపించలేదు. ఇంటిస్థలం కేటాయించి ఉంటే ఈ సమయానికి నిర్మాణం పూర్తి అయ్యేది. ఇప్పుడు కడితే బిల్లులు ఎప్పుడు పడతాయి. ఎలెక్షన్ కోడ్ వస్తే బిల్లులు రావు. ఇదంతా అధికారుల నిర్లక్ష్యం కారణంగానే జరిగింది.

- శివయ్య, సుండుపల్లె

సుండుపల్లె, ఫిబ్రవరి 11: మండల కేంద్రానికి సమీపంలో పేదలకు స్థలాలు ఇవ్వాలని, అనువైన స్థలం లేకపోతే కొని ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, పాలకుల మాటలు ఆచరణలోకి వచ్చేసరికి వారి మాటలు నీటి మూటలుగానే మిగిలాయని ప్రజలు, లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఒత్తిడి రాగానే ప్రజాప్రతినిధుల దగ్గర మెప్పు పొందేందుకు అధికారులు అర్హులైన లబ్ధిదారులకు కొంత మందికి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. కానీ ఇంటి స్థలాలు చూపించడంలో పూర్తిగా విఫలమయ్యారని, లేఅవుట్లు లేకుండానే ఎలా పట్టాలు పంపిణీ చేస్తారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి సుమారు మూడు కి.మీ. దూరంలో సర్వే నెంబర్ 1387లో ఇంటి పట్టాలు పంపిణీ చేసి సుమారు రెండు సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు సుమారు 54 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపించలేదు. ఇదేమిటని అడిగితే సమాధానం చెప్పే నాథుడే కరువయ్యారని చెబుతున్నారు. స్థలాలు చూపించండి మహాప్రభో అని వేడుకున్నా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులు, పాలకులు కానీ పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

మండల వ్యాప్తంగా 22 చోట్ల జగనన్న లేఅవుట్లు వేశారు. ఈ లేఅవుట్లలో సగం ప్లాట్లు లబ్ధిదారులకు కట్టబెట్టినట్లు జోరుగా విమర్శలు వస్తున్నాయి. అరకొరగా జగనన్న పట్టాలు పొంది లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ కోసం సచివాలయాల చుట్టూ పడిగాపులు కాస్తున్నారు. పట్టాలు పొందిన అర్హులకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని వలంటీర్లు సచివాలయాల వద్దకు పరుగులు తీయిస్తున్నారు. రాత్రి సమయంలో కూడా రిజిస్ట్రేషన్ కోసం లబ్ధిదారులను సచివాలయ సిబ్బంది తిప్పుకుంటున్నారని వాపోతున్నారు. ఎన్నికల ముందు కేవలం ఓట్ల కోసమే ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించిందని ప్రతిపక్ష పార్టీలు, నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. విలువైన భూములను అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకొని ఊరికి దూరంగా గుట్టల్లో, గుట్టల కింద లబ్ధిదారులకు తూతూ మంత్రంగా పట్టాలిచ్చారని జోరుగా విమర్శలు వస్తున్నాయి.

మండలమంతా 1071 మందే అర్హులు

మారుమూల సుండుపల్లె మండలంలో 1071 మంది మాత్రమే అర్హులు ఉన్నట్లు వలంటీర్లు గుర్తించారు. 14 గ్రామ పంచాయతీల్లో సుమారు 70 వేలకు పైగా జనాభా కలిగిన మండలంలో వలంటీర్లకు ఇళ్లు లేని నిరుపేదలే కనపడలేదా.. లేదా అధికార పార్టీ నాయకులు చెప్పిన వారే అర్హులా అని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిలువ నీడలేని ఎంతో మంది నిరుపేదలు పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్న వారు నిరుపేదలు కారా, అలాంటి వారిని గుర్తించడంలో ప్రభుత్వ అధికారులు, వలంటీర్లు పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు వస్తున్నాయి.

వసతులు ఎక్కడ జగనన్నా..!!

నిజమైన అర్హులు నిరుపేదలకు మండల కేంద్రానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో కంచిపాటివాండ్లపల్లె సమీపంలో గల సర్వే నెంబరు 2475లో 126 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. సుమారు రెండు సంవత్సరాల తరువాత తూతూ మంత్రంగా లేఅవుట్ చేశారు.



2475 సర్వే నెంబరులో గుట్టలో ఇంటిస్థలాలు కేటాయించిన దృశ్యం

మండల కేంద్రానికి దూరంగా ఎటువంటి వసతులు లేని ప్రదేశంలో గుట్ట కింద పట్టాలు ఇవ్వడంపై లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుట్టలో చదును చేసి ప్లాట్లు వేయడం వలన పెద్ద పెద్ద బండరాళ్లు దర్శనం ఇస్తున్నాయి. బండలమీద సైతం ప్లాట్లు వేయడం వలన బండలపైన ఎలా గునాదులు తీయాలి, ఎలా ఇళ్లు కట్టాలని లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టడం లేదు. మండల కేంద్రం నుంచి దూరం కావడంతో అధికారులు ఎటువంటి వసతులు కల్పించకపోవడం వలన లబ్ధిదారులు ఎవ్వరూ ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. కనీసం నీటి వసతి కూడా లేని చోట ఎలా ఇళ్లు కట్టాలని చెబుతున్నారు. దాదాపు 22 లేఅవుట్లలో ఇదే పరిస్థితి కొనసాగుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు.

ఈ పూరి గుడిసెలు కనిపించలేదా..?

మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ డాక్టర్ జనార్ధన్‌రెడ్డి కాలనీలో గత ఆరు సంవత్సరాల నుంచి సుమారు 10 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరికి కరెంటు, తాగునీటిని అందించారు. కానీ నిలువ నీడలేని నిరుపేదలకు జగనన్న పక్కా గృహ నిర్మాణాలు దరిచేరలేదు. సంచార జీవనం సాగించి ఓ తాత ఇచ్చిన స్థలంలో ఎస్టీలు జీవనం సాగిస్తున్నారు. కొందరు కూలి పనులకు వెళితే, మరికొందరు మేకలు మేపుకొని బతుకుతున్నారు. వీరిని గుర్తించడంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇకనైనా స్పందించి వీరికి సంక్షేమ పథకాలు దరిచేరేలా చేయాలని కోరుతున్నారు. ఇదే విధంగా మండల వ్యాప్తంగా వందలాది మంది అర్హులు సొంతింటి కల ఎప్పటికీ నెరవేరుతుందో అని ఎదురుచూస్తున్నారు.

వచ్చే వారంలో 54 మందికి ఇంటి స్థలాలు కేటాయిస్తాం..

వారం రోజుల్లోపు 54 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలం చూపిస్తాము. అక్కంపల్లి లేఅవుట్ వద్ద ప్లాట్ల పంపిణీకి స్థలాన్ని సిద్ధం చేశాము. అలాగే కంచిపాటివాండ్లపల్లె దగ్గర ఉన్న లేఅవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులకు వీలుగా ఉండేలా ఏర్పాట్లు చేస్తాము. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఎంతమందికైనా ఇంటి స్థలాలు ఇస్తాము.

-షేక్ జరీనా, తహసీల్దార్

బోద గుడిసెల్లో బతుకుతున్నాము..



గత ఐదు సంవత్సరాల నుంచి డాక్టర్ జనార్ధన్‌రెడ్డి కాలనీలో జీవనం సాగిస్తున్నాను. పరక పుల్లలు తెచ్చుకొని వాటిని అమ్ముకొని ఆ డబ్బుతో బియ్యం, సరుకులు తెచ్చుకొని తింటున్నాము. ఎక్కువ వర్షం పడితే గుడిసెలో నిద్రపోలేము. ఎక్కువ గాలి వచ్చినా పైకప్పు ఊడిపోతుంది. ప్రభుత్వం మాకు ఒక్క రూము కట్టించినా చాలు బతుక్కుంటాము. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.

- చిన్నక్క, ముడుంపాడు



ముడుంపాడు గ్రామ పంచాయతీలో బోద ఇంట్లో నివాసం ఉంటున్న నిరుపేదలు

పట్టాలిచ్చారు.. స్థలం చూపించండి..



పట్టాలిచ్చినా స్థలం చూపించడం లేదు. సుమారు రెండు సంవత్సరాల క్రితం మీకు ఇంటి స్థలం మంజూరైంది. ఇళ్లు కట్టుకోండి, ప్రభుత్వం నుంచి డబ్బు వస్తుందన్నారు. పట్టాలు తెచ్చుకున్నాము. వారం తర్వాత స్థలం చూపిస్తామన్నారు. రెండు సంవత్సరాలు అయినా ఇప్పటి వరకు స్థలం చూపించలేదు. ఎవరిని అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విధంగా మోసం చేయడం సరికాదు. ఇంటి స్థలం చూపిస్తే ఇళ్లు కట్టుకుంటాము.

- నాగరాణి, లబ్ధిదారురాలు

ప్రజల ఆస్తిని దారాదత్తం చేస్తే ఊరుకోం

- యాత్ర-2 డైరెక్టర్‌పై ప్రేమ ఉంటే మీ సొంత భూములివ్వండి
- తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

మదనపల్లె/ములకలచెరువు/పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట, ఫిబ్రవరి 11: ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ భూములను దారాదత్తం చేస్తే ఊరుకోమని, ఈ నిర్ణయాన్ని వైసీపీ ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాత్ర-2 దర్శక, నిర్మాత మహీ వి.రాఘవపై సీఎం జగన్‌కు అంత ప్రేమ ఉంటే పులివెందులలోని తన సొంత భూములను రాసివ్వాలన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కాగా ప్రభుత్వ కుట్రను బయటపెట్టిన ఆంధ్యజ్యోతికి ఆయన అభినందనలు తెలిపారు.

జగన్ అరాచకాలకు అడ్డు లేకుండా పోతోంది : పర్వీన్ తాజ్

రాష్ట్రంలో జగన్‌రెడ్డి అరాచకాలకు అడ్డూ, అదుపు లేకుండా పోతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.పర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. పీటీఎం, బి.కొత్తకోట మండలాల్లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. యాత్ర-2 డైరెక్టర్ మహి రాఘవకు అదనపు నజరానాగా హార్సిలీహిల్స్‌లో రూ.20 కోట్ల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని ఆమె తప్పుపట్టారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజా సంఘాలను కలుపుకుని పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని, తక్షణం వెనక్కు తీసుకోవాలని ఆమె కోరారు.

భూ కేటాయింపును అడ్డుకుంటాం : రామ్‌దాస్ చౌదరి

తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడిన సీఎం జగన్... ఆంధ్రా ఊటీగా పేరొందిన హార్సిలీహిల్స్‌ను ప్రైవేటు సంస్థకు భూ సంతర్పణ చేయడాన్ని జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి ఖండించారు. స్థానిక కమ్మవీధిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం సొంత డబ్బా తీసిన డైరెక్టర్ మహి రాఘవ సంస్థకు రెండెకరాల భూమి ఎలా కట్టబెడతారని ఆయన ప్రశ్నించారు.

జోరుగా కర్ణాటక మద్యం విక్రయాలు

- తూతూ మంత్రంగా దాడులు
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం
- రాజకీయ నాయకుల అండతో రెచ్చిపోతున్న వ్యాపారులు



పీటీఎంలో కుప్పలు తెప్పలుగా పడి ఉన్న కర్ణాటక మద్యం ఖాళీ ప్యాకెట్లు, నీళ్ల ప్యాకెట్లు, గ్లాసులు

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 11: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలు కర్ణాటక సరిహద్దుకు దగ్గరగా ఉండడంతో అక్కడి మద్యం జోరుగా ఇక్కడికి అక్రమ రవాణా సాగుతోంది. ఈ మండలాలతో పాటుగా మరికొన్ని మండలాల్లో ప్రభుత్వ మద్యం కన్నా కర్ణాటక మద్యమే ఎక్కువగా విక్రయిస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో ఎటు చూసినా కర్ణాటక మద్యం ఖాళీ ప్యాకెట్లే దర్శనం ఇస్తుండడంతో అవి చూసిన ప్రజలు విస్తుపోతున్నారు.

సరిహద్దు గ్రామాల నుంచి యథేచ్ఛగా..

మండలానికి సరిహద్దు గ్రామాలైన సంపతికోట, మల్లెల, పట్టెంవాండ్లపల్లె, కమ్మచెరువు, నవాబుకోట, గంగంపల్లె, కాపుపల్లె వంటి సరిహద్దు గ్రామాల మీదుగా ప్రతి రోజు యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ గ్రామాల పరిధిలో మల్లెల చెక్‌పోస్టు, మారుగానిపల్లె చెక్‌పోస్టు, అంకాలమడుగు చెక్‌పోస్టులు ఉన్నాయి. అయితే అక్రమార్కులు ఈ మార్గాల్లో కాకుండా సరిహద్దు గ్రామాల్లోని వేరే మార్గాల ద్వారా యథేచ్ఛగా అక్రమ రవాణా చేసి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కాగా కర్ణాటక సరిహద్దు గ్రామాలైన కందుకూరు సమీపంలోని జింకలమిట్ట సమీపంలో అనేకసార్లు అధికారులు దాడులు చేసి అక్రమ మద్యాన్ని పట్టుకున్నా రాజకీయ నాయకుల అండదండలతో మళ్లీ యథేచ్ఛగా అక్రమ రవాణా చేసి వ్యాపారాలను కొనసాగించి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

ఏపీలో సరైన బ్రాండ్లు లేకపోవడమే

మద్యానికి బానిసలైన మందుబాబులకు ఆంధ్రలో సరైన బ్రాండ్లు లభించకపోవడంతో కర్ణాటక మద్యానికి అలవాటు పడ్డ మందుబాబులు అధికంగా అక్కడి మద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. తద్వారా అక్రమ మద్యం వ్యాపారులకు మూడు పువ్వులు ఆరు కాయలుగా కర్ణాటక మద్యం అమ్ముడుపోతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రోజుకో బ్రాండ్ ఉండడంతో ఇక్కడ అమ్ముతున్న మద్యంపై మందుబాబులు మక్కువ చూపడం లేదు.

కర్ణాటక రాష్ట్రానికి ఆదాయ వనరుగా..

మన రాష్ట్రంలో అధిక శాతం మంది మందుబాబులు కర్ణా టక మద్యం కొనుగోలు చేస్తుండడంతో ఆ రాష్ట్రానికి ఆదా య వనరుగా మారుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడ కష్టపడి సంపాదించిన సొమ్మంతా కర్ణాటక రా ష్ట్రానికి తరలిపోతోందని, పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఏపీలోని ప్రభుత్వ దుకాణాల్లో అమ్ముతున్న మందుపై అపనమ్మకంతో కర్ణాటక మద్యంపై అధిక శాతం మంది మొగ్గు చూపుతుండడంతో అక్రమ వ్యాపారులకు వరంగా మారుతోంది. ప్రతిరోజు కర్ణాటక రాష్ట్రం నుంచి వివిధ మం డలాలకు అక్రమ మద్యం రవాణా జరుగుతున్నా కట్టడి చే యాల్సిన అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహ రిస్తోందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. మరి కొంతమంది అక్రమ వ్యాపారులు రాజకీయ నాయకుల అండదండలతో అధికారుల కళ్లకు మామూళ్ల గంతలు కట్టి విచ్చలవిడిగా అక్రమ రవాణా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 10 లీటర్ల లోపు మద్యం పట్టుబడితే కేసులు లేవు అన్న నిబం ధనతోనే అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన వారు మళ్లీ అదే వ్యాపారాల్లోకి దిగి సొమ్ము చేసుకుంటున్నారు. ఏదే మైనా గతంలో అక్రమంగా సాగిన మద్యం వ్యాపారాలపై సంబంధిత అధికారులు కనీసం ఇప్పటికైనా చర్యలు తీసుకుని కట్టడి చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

అక్రమ మద్యాన్ని అరికడతాం..

కర్ణాటక రాష్ట్రం నుంచి ఎవరైనా 10 లీటర్ల లోపు మద్యాన్ని తరలిస్తే వారిపై ఎటువంటి కేసు నమోదు చేయకూడదనే నిబంధన ఉంది. ఈ కారణంగా అక్రమ మద్యాన్ని కట్టడి చేసేందుకు వీలు లేకుండా పోతోంది. కర్ణాటక రాష్ట్రం నుంచి ఎవరైనా ఒక వ్యక్తి కొద్దిపాటిగా తరలిస్తూ పట్టుబడినా ఆ వ్యక్తిపై కేసు నమోదు చేయలేకపోతున్నాం. ఇందువల్లే వారు తిరిగి అక్రమ మద్యం వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నారు. కర్ణాటక సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి అక్రమ మద్యాన్ని అరికడతాం.

- జి.రామ్మోహన్, ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ములకలచెరువు



కారుతో సహా కర్ణాటక మద్యంతో పట్టుబడిన నిందితులతో పోలీసులు (ఫైల్)

కోతల.. కరెంటు

- 9 గంటల విద్యుత్ సరఫరా ఎత్తివేసి.. 7 గంటలే ఇస్తున్నారు
- ఎండుతున్న సజ్జ, మొక్కజొన్న, వరి పంటలు
- రైతులు అడిగితే ఎల్ఆర్ అంటున్న విద్యుత్ అధికారులు
- కనీసం 20 రోజులైనా తొమ్మిది గంటల కరెంటు ఇవ్వాలని వేడుకోలు

బి.కోడూరు, ఫిబ్రవరి 11: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులను కరెంటు కోతలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న పైర్లు కళ్ల ముందే ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఏమి చేయాలో అర్థకం కాక సతమతమవుతున్నారు.

ప్రభుత్వం వ్యవసాయానికి నిరంతరాయ 9 గంటల విద్యుత్ ప్రకటించడంతో రైతులు బోర్ల కింద విస్తారంగా పంటలు సాగు చేశారు. ఇపుడు పంటలు చేతికివచ్చు సమయంలో 7గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేయడం.. అది కూడా ఎప్పుడు పడితే అప్పుడు కోతలు విధిస్తుండటంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది బి.కోడూరు మండలంలో ఎకరాకు 30 నుంచి 40 వేల వరకు పెట్టుబడి బోర్ల కింద పంటలు సాగు చేశారు. 3వేల ఎకరాల్లో మొక్కజొన్న, సజ్జ మూడువేల ఎకరాలు, వరి 2వేల ఎకరాలు.. ఇలా దాదాపు 7వేల ఎకరాలలో పంటల సాగు చేపట్టారు. ప్రతి ఏడాది ఒక్కో రైతు బోరు కింద 3 ఎకరాలు మాత్రమే సాగు చేసేవారు. ఈ ఏడాది 5 నుంచి 7 ఎకరాలు సాగు చేశారు. సాగు చేసిన సజ్జ, జొన్న, వరి గింజ పట్టి చేతికందే దశలో ఉంది. ఉన్నట్లుండి 9గంటల కరెంటు తొలగించి 7గంటలు ఇస్తున్నారు. అది కూడా కోతలు విధిస్తూ ఇష్ట మొచ్చినట్లు సరఫరా చేస్తున్నారు. ఎవరైనా రైతులు అడిగితే ఎల్ఆర్ అని విద్యుత్ అధికారులు తప్పించుకుంటున్నారు. దీంతో సాగు చేసిన పంటలన్నీ నీటి తడులు అందక దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఈ విషయమై విద్యుత్ ఏడీ నాయక్‌ను వివరణ కోరగా, పై నుండే ఆ విధంగా ఇవ్వమని చెబుతున్నారు, కాబట్టి మేం పాటించక తప్పదని అంటున్నారు.


ఎండుతున్న మొక్కజొన్న పంట

9గంటల కరెంటు నమ్ముకుని...



నాకున్న బోరు కింద రెండు ఎకరాలు సజ్జ, రెండు ఎకరాలు వరి సాగు చేశాను. ఎకరాకు 40 నుంచి 50వేల వరకు పెట్టుబడులు పెట్టాను. అది గింజ పట్టి చేతికందే దశలో ఉన్నట్లుండి 9గంటల కరెంటు తొలగించి ఏడుగంటలే విద్యుత్ అందిస్తున్నారు. దీంతో నీటి తడులు అందక పంటలు ఎండి పోతున్నాయి. ఈనెల చివరి వరకైనా 9గంటలు విద్యుత్ సరఫరా చేయాలి.

- రమణారెడ్డి, రైతు, గోవిందాయపల్లె

మొక్కజొన్న పంట ఎండుతోంది



నేను వ్యవసాయ బోరు కింద మొక్కజొన్న సాగు చేశాను. అది కంకి గింజ పట్టే దశలో ఉంది. కరెంటు చూస్తే ఏడుగంటలే ఇస్తున్నారు. అది కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. 9గంటలు వ్యవసాయ కరెంటు నెలచివరి దాకా ఇస్తే బాగుంటుంది. అధికారులు రైతులను అర్థం చేసుకోవాలి.

- సిద్దు వెంకటసుబ్బారెడ్డి, రైతు, మేకవారిపల్లె

వణ్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- స్మగ్లర్లపై నిఘా పెట్టేందుకు బేస్ క్యాంపుల నిర్వహణ
- ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి


జంతువుల దాహం తీర్చేందుకు తొట్లలో నీటిని నింపుతున్న అటవీ సిబ్బంది

సిద్దవటం, ఫిబ్రవరి 11: వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసులు పేర్కొన్నారు. మండలంలోని లంకమల అభయారణ్యంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్యప్రాణుల సంఖ్యను పెంచేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. స్మగ్లర్లను ఏరివేసేందుకు పలు చోట్ల బేస్‌క్యాంపులు ఏర్పాటు చేశామని, అడవిలో వేటగాళ్లు వన్యప్రా ణులకు హాని తలపెట్టకుండా సీసీ కెమెరాల పరిరక్షణ ఉంటుందన్నారు. ఎండకాలం సమీపిస్తుండటంతో జంతువుల దాహం తీర్చేందుకు నీటి కుంటల్లో, చెక్ డ్యాంలలో సాసర్ పిట్లలో నీటి నింపే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అడవిలో అగ్ని ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా అడవికి సమీపంలోని గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అడవులు లేకపోతే మానవులు మనుగడ ఎలా ఉంటుందో వివరిస్తున్నామన్నారు. అటవీ ప్రాంతంలో రహదారులలో వెళుతున్న వాహ నదారులు 30కి మించి స్పీడ్ వెళ్లరాదని.. అతివేగంతో వెళితే వాహనాలు ఢీకొని జంతువులు మృత్యువాత పడే అవకాశం ఉందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు


చోరీకి పాల్పడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులను చూపుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 11: పులివెందుల పట్టణంలో ఒంటరిగా ఉన్న ఓ మహిళ ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత నెల 25వ తేదీ పులివెందుల పట్టణం కదిరిరోడ్డు సమీపంలోని ఓ ఇంటిలో మహిళ ఒంటరిగా ఉండగా మాస్కు ధరించి కత్తి తీసుకొని ఇంట్లోకి ప్రవేశించి.. మెడలోని రెండు తులాల బంగారు గొలుసులని లాక్కొని పారిపోయాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కేసులో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అందిన సమాచారం మేరకు సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ అరుణ్‌రెడ్డిలు తన సిబ్బందితో ముద్దనూరు రింగురోడ్డులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. అతడి నుంచి రెండు గొలుసులను, చోరీకి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు 14 మంది ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

బద్వేలు, ఫిబ్రవరి 11: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శని, ఆదివారం రెండు రోజుల పాటు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. జిల్లా స్థాయిలో 140 ప్రదర్శనలు రిజిస్ట్రేషన్‌కు ఎంపిక కాగా... వాటిలో 14 ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి నేషనల్ అబ్జర్వర్‌గా వచ్చిన మహిమ, కార్తికేయలు ప్రకటించినట్లు జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు మెమెంటోలు ఇచ్చి అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాల్యదశ నుంచే శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభను కనపరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యేలా ప్రయత్నం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరామిరె డ్డి, వెంకట క్రిష్టారెడ్డి, డాక్టర్ ఫక్రుద్దీన్, ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు వీరే

బద్వేలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సాత్విక్, చక్రాయపేట మండలం ఉప్పలవాండ్లపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన గణేష్, చాపాడు మండలం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన చరణ్, చాపాడు మండలం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఆసిఫా, ప్రొద్దుటూరు ఎస్‌కే సబీఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన చాతుర్య, కమలాపురం పాఠశాలకు చెందిన రుద్వేద, కడప నాగార్జున ఉన్నత పాఠశాలకు చెందిన హితేష్ జైన్, నాగార్జున మోడల్ స్కూల్‌కు చెందిన అభిలాష్, అలాగే నిర్మల హైస్కూల్‌కు చెందిన సయ్యద్ సోఫియా, కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.గౌతమి, లింగాల మండలానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బండి ప్రగతి, పులివెందుల, విద్యాధరి ఉన్నత పాఠశాలకు చెందిన షర్మి, సిద్దవటం ఉన్నత పాఠశాలకు చెంది నిత్యపూజయ్య, అదే మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అభిలాష్‌లు ఎంపియ్యారు

పాత పెన్షన్‌పై పెదవి విప్పండి: యూటీఎఫ్


కలెక్టరేట్ ఎదుట పోస్టర్లు అతికిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 11 :పాతపెన్షన్ అమలుపై ప్రభుత్వం పెదవి విప్పాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టరును కడప కలెక్టరేట్, డీఈఓ కార్యాలయంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో గోడలకు అతికించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాత పెన్షన్ సాధన కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి జీపీఎస్ అనే మరో దుర్మార్గ పెన్షన్ విధానం ప్రవేశపెట్టడం మోసగించడమేనన్నారు. పాత పెన్షన్ సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలను కలిపి రాజకీయ అంశంగా మారుస్తామన్నారు. అందులో భాగంగానే ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో వాల్‌పోస్టరు ద్వారా సమస్యను రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. పాత పెన్షన్ సాధన సమస్యను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, కరీముల్లా, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు...ఒకరి మృతి

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 11: మైదుకూరు సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ప్రొద్దుటూరుకు చెందిన సాయి లక్ష్మినాధరావు (40) అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సాయి లక్ష్మినాధరావు వృత్తి రిత్యా ఫొటోగ్రాఫర్. క్యాంపు పనిమీద ప్రొద్దుటూరు నుంచి కడపకు వెళుతూ మైదుకూరు సమీపంలోకి రాగానే వెనుక నుంచి కారు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

వీరబల్లి, ఫిబ్రవరి 11: మండల పరిధిలోని వంగిమళ్ల పంచాయతీకి చెందిన నాగన్న అనే వ్యక్తి దగ్గర 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. అదేవిధంగా సానిపాయికి చెందిన రమణ అనే వ్యక్తి దగ్గర 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం ఇద్దరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట, ఫిబ్రవరి 11 : రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా ఇద్దరు గాయపడిన సంఘటన పీటీఎం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా... మల్లెల పంచాయతీ కాప్పల్లికి చెందిన సురేష్ అనేపేర్లు గల ఇద్దరు వ్యక్తులు శనివారం రాత్రి తమ స్వంత పనుల నిమిత్తం బి.కొత్తకోటకు తమ ద్విచక్రవాహనంలో వెళ్లి వస్తుండగా మల్లెల క్రాస్ సమీపంలోకి రాగానే వాహనంలో పెట్రోల్ అయిపోయింది. దీంతో వారు ద్విచక్ర వాహనాన్ని తోసు కుంటు వస్తుండగా ఇదే మల్లెల పంచాయతీ పెద్దమేకలవారిపల్లెకు చెందిన రాఘవరెడ్డి (45) అనే అతను బి.కొత్తకోట నుంచి తమ స్వగ్రామమైన పెద్దమేకలవారిపల్లెకు వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి వారి మీదకు వేగంగా దుసుకెళ్లడంతో సురేష్‌లు ఇద్దరికి గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం వేగంగా వచ్చి వారిని ఢీకొని పక్కనే ఉన్న కాలువలోకి పడిపోవడంతో రాఘవరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు గమ నించి హుటాహుటిన 108 వాహనానికి సమాచారం అందించ డంతో హుటాహుటిన వాహనం అక్కడికి చేరుకోగా 108 సిబ్బంది రాఘవరెడ్డి పరిశీలించి అతను మృతి చెందాడని నిర్ధారించారు. గాయపడిన వారిని ఇద్దరిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడున్న స్థానికులు రాఘవరెడ్డి బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తర లించారు. అనంతరం మృతదేహాన్ని తన స్వగ్రామమైన మల్లెల పంచాయతీ పెద్దమేకలవారిపల్లెలో ఆదివారం రాత్రి దహన క్రియలను పూర్తి చేశారు. మృతుడికి భార్య సులోచన 4సంవత్స రాల కుమార్తె 8నెలల కుమారుడు ఉన్నారు. రాఘవరెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. రాఘవరెడ్డి టీడీపీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసే కార్యకర్త కావడంతో పలువురు టీడీపీ నేతలు వచ్చి నివాళులర్పించారు.

అప్పులతో వస్త్ర వ్యాపారి పరారీ

మదనపల్లె, ఫిబ్రవరి 11: మదనపల్లె పట్టణం ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలోని వస్త్ర దుకాణం నడుపుతున్న ఓ వ్యాపారి అప్పులు చేసి పరారయ్యాడు. పెద్దమండ్యం మండలం మందలవారిపల్లెకు చెందిన ఈయన..కొన్నేళ్లుగా పట్టణంలోని ఉంటూ వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. ఇందులోభాగంగా స్థానికంగా వ్యాపారులు, తెలిసిన వారి నుంచి అప్పులు చేశాడు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో దుకాణం మూసివేసి అదృశ్యమయ్యాడు. మదనపల్లె, పెద్దమండ్యం ఏరియాలకు చెందిన వారి నుంచి సుమారు రూ.కోటికి పైగా అప్పు చేసినట్లు చెబుతున్నారు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో దుకాణం మూసివేసి పరారైనట్లు భావిస్తున్నారు. దుకాణం మూతపడటం, ఆయన అందుబాటులో లేకపోవడంతో రుణదాతలకు అనుమానం వచ్చి స్థానికంగాను, స్వగ్రామంలోనూ ఆరా తీసినా ఆచూకీ లభించక పోవడంతో బాధితులు కొందరు స్థానిక టూటౌన్, పెద్దమండ్యం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు విచారణ చేప ట్టారు.

ఆటో బోల్తా..యువకుడి పరిస్థితి విషమం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 11: ఆటో బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు తీవ్రగాయాలపాలైన సంఘటన గుర్రంకొండ మండలంలో చోటు చేసుకుంది. మదనపల్లె పట్టణం చంద్రాకాలనికి చెందిన మల్లికార్జున(18), వెంకటేశ్ చంద్ర, గణేష్‌లు కలసి గ్రామాల్లో గుజిరి సామాన్లు కొనుగోలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో రెండు నెలల క్రితం మల్లికార్జున ఆటో కొనుగోలు చేసి గ్రామాల్లో గుజిరీ సామాన్లు మదనపల్లెకు తరలించేవారు. ఆదివారం ఉదయం వారు నలుగురు గుర్రం కొండకు ఆటోలో వెళుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో మల్లికార్జున తలకు తీవ్రగాయాలు కాగా, మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

పులివెందులలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 11: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యమని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. పులివెందులలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి నుంచి కాంగ్రెస్‌కు కంచుకోట అని, 17సార్లు ఎన్నికలు జరగ్గా 13సార్లు కాంగ్రెస్ గెలిచిందన్నారు. పైడిపాళెం రిజర్వాయర్, లింగాల కెనాల్, గండికోట-సీబీఆర్ ఎత్తిపోతల, జేఎన్టీయూ, ట్రిపుల్‌ఐటీ, అంతర్జాతీయ పశుపరిశోధనా కేంద్రం, శిల్పారామం, రింగురోడ్డు, భూగర్భడ్రైనేజీ, సిమెంటురోడ్లు, పులివెందుల-కడప నాలుగు వరుసల రోడ్డు ఇవన్నీ కాంగ్రెస్ పాలనలోనే పూర్తి అయ్యాయన్నారు. కాంగ్రెస్ పాలనలో పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, బిందుసేద్యం పరికరాలు సకాలంలో అందేవన్నారు. జగన్ పాలనలో పులివెందుల అసాంఘిక శక్తుల అడ్డాగా మారిందన్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగి ఐదేళ్లయినా దర్యాప్తు పూర్తికాలేదన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ నిధులు లేక వెలవెలబోతోందన్నారు. ఈనేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ గెలవాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉందన్నారు. మీడియా సమావేశంలో పులివెందుల మండలశాఖ అధ్యక్షులు తిరుపేలరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్, వెంగళరెడ్డి, నాగరాజు, ఉత్తన్న, వినయ్, నిఖిల్, శరత్‌చంద్ర, జగన్‌మోహన్‌రెడ్డి, స్టాన్లీబాబు, చిన్న, శ్రీనివాసులు, గంగాదర తదితరులుపాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిపించాలి... అఖిలపక్ష నేతలు



మాట్లాడుతున్న అఖిలపక్ష పార్టీల నేతలు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 11 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అసాంఘిక శక్తులను అరికట్టి ఎన్నికలు ప్రశాంతంగా జరిపించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనరు బందెల ఓబయ్య అధ్యక్షతన ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన చర్చా వేదికలో బీసీ సంఘం నాయకులు, చేతివృత్తుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లిఖార్జున, జనతాదళ్ నేత ప్రతాప్‌రెడ్డి, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక రాష్ట్రకన్వీనరు కారు ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి, మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంగటి మనోహర్, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నేత జేవీ రమణ, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత శ్రీనివాసులు, హేతువాద సంఘం కన్వీనరు సీఆర్‌వీ, ప్రముఖ న్యాయవాది అమీన్‌పీరా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి జకరయ్య, మహిళా సంఘం నాయకురాలు శ్యామల, లక్ష్మి, రైతు సేవా సమితి అధ్యక్షుడు పి.శివారెడ్డి, కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, దళిత ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు రెడ్డన్న మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, పోటీ చేసే అభ్యర్థులు సామరస్యంతో ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు. అధికారులు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై నిఘా ఉంచాలన్నారు. ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో జరగకూడని సంఘటనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. అందులో భాగంగా జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తన ప్రత్యర్థి అభ్యర్థిని బెదిరించడం, డిప్యూటీ సీఎం తమ్ముడు ప్రత్యర్థి మహిళా అభ్యర్థి విషయంలో ప్రవర్తించిన తీరు సరికాదన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై సోషల్ మీడియాలో వస్తున్న ఘటనలు, వ్యక్తిగత దూషణలు సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉన్నాయన్నారు. డిప్యూటీ సీఎం తమ్ముడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరు, ఎస్పీలను కలవనున్నట్లు వారు తెలిపారు.

జడ్పీ చైర్మన్‌కు పదవీ గండం?

- కొత్త చైర్మన్ రేసులో బి.మఠం జడ్పీటీసీ



కడప, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి పదవీగండం పొంచిఉన్నట్లు చెబుతున్నారు. అమర్‌నాథరెడ్డిని ఆ పార్టీ అధిష్టానం వైసీపీ రాజంపేట సమన్వయకర్తగా నియమించింది. వచ్చే ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ స్థానానికి వైసీపీ తరపున ఆయన పోటీ చేయడం దాదాపు ఖరారైనట్లే. ఈ నేపథ్యంలో ఆయనను జడ్పీ చైర్మన్ పదవి నుంచి త్వరలో తప్పిస్తారని సమాచారం. జడ్పీ చైర్మన్ స్థానాన్ని బి.మఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డి ఆశిస్తున్నట్లు చెబుతున్నారు.

ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. ప్రతిపక్షనేతలు నామినేషన్లు వేసే పరిస్థితి లేదు. కొన్నిచోట్ల నామినేషన్లు వేసినా రకరకాల కారణాలతో తిరస్కరణకు గురైతే కొందరు బరిలో లేని పరిస్థితి నెలకొంది. టీడీపీ గోపవరం జడ్పీటీసీ స్థానాన్ని మాత్రమే గెలుచుకోగా మిగతా 49 స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అనంతరం ఉమ్మడి జిల్లా విభజన జరిగి రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు అన్నమయ్య జిల్లాలో చేరాయి. అయినప్పటికి పాత పాలకవర్గమే కొనసాగుతోంది. అమర్‌నాథరెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడంతో జడ్పీ చైర్మన్ పదవిపై ఊహాగానాలు రేకెత్తుతున్నాయి. చైర్మన్ పదవి కోసం బి.మఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈయన కాంట్రాక్టర్. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం భారీగా ఖర్చుపెట్టానని ఇపుడు తనకు పదవి ఇవ్వాల్సిందేనంటూ ఆయన డిమాండ్ చేస్తున్నట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. పదవి ఇవ్వకపోతే పార్టీ మారేందుకు ఈయన సిద్ధమైనట్లు వైసీపీలో చర్చ నడుస్తోంది. ఈ పదవి కోసం అన్నమయ్య జిల్లాకు చెందిన జడ్పీటీసీలు కూడా ముమ్మర ప్రయత్నాల్లో ఉన్నారంటున్నారు. అయితే చైర్మన్ పదవి ఆశిస్తున్న వారి నుంచి జడ్పీటీసీ సభ్యులు కొంత డబ్బు డిమాండ్ చేస్తున్నారని తెలిసింది. అయితే ఆల్‌రెడీ తాను ఖర్చుపెట్టానని ఇప్పుడు ఇచ్చేది లేదంటూ రామగోవిందరెడ్డి తెగేసి చెప్పినట్లు తెలిసింది.

నేడు స్పందన కార్యక్రమం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 11: జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని ఈ నెల 12న సోమవారం ఉదయం 10 గంటల నుంచి రాయచోటి జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులకు స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

ఘనంగా పార్వేట తిరుణాల



దర్శనం కోసం వేచియున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 11: అనంతపురం గంగమ్మ ఆలయంలో ఆదివారం పార్వేట తిరుణాల ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి యాదవులు గొల్లపల్లె లోని దేవరింటి నుంచి అమ్మవారిని ఊరేగింపుతో తీసుకొచ్చారు. ఆదివారం వేయి కన్నుల చీర, జాకెట్, కళ్లు, కోరలు, అమ్మవారి ఆభరణాలు తదితరాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి బలిపిల్లను సమర్పించి భక్తులకు అందజేస్తారు. ఈ రోజు నుంచి జాతర వరకు ప్రతి రోజు అమ్మవారు ప్రత్యేక అలంకారంతో దర్శనమిస్తారు. చెల్లు వంశీయులు పూజలు నిర్వహిస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లక్కిరెడ్డిపల్లె పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి రవీంద్రరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీజేపీ కార్యదర్శిగా సుబ్బారావు



నియమక పత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 11: నియోజకవర్గ బీజేపీ నియోజకవర్గ కార్యదర్శిగా జోగినేని సుబ్బారావును నియమించినట్లు కన్వీనర్ గడ్డం చెంగల్‌రాజు తెలిపారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నియమక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనతల సురేష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ వర్మ, రాష్ట్ర మాజీ కన్వీనర్ తోట శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా సీనియర్ నాయకులు బత్తల సుబ్రహ్మణ్యం, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ గడికోట సాంబశివరావు, కుశల్ యాదవ్, రవితేజ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి మండల అధ్యక్షుడిగా బాపూజీ



చిట్వేలి: బీజేపీ చిట్వేలి మండల అధ్యక్షునిగా నాగవరం వడ్డిపల్లెకు చెందిన పుల్లంగంటి బాపూజీని ఎంపిక చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి అహర్నిశలు పాటుపడతానన్నారు. ఇందుకు కృషి చేసిన జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్‌కు, బీజేపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పెనగలూరు మండల బీజేపీ అధ్యక్షుడుగా..



మన్నెం మల్లికార్జున

పెనగలూరు: మండల బీజేపీ అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసినట్లు పొందలూరుకు చెందిన మన్నెం మల్లికార్జున తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ తనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్, రైల్వేకోడూరు ఇన్‌చార్జి చెంగల్‌రాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఇ.సుబ్రమణ్యం, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌బాబుతో పాటు రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

నాగారపమ్మకు పూజలు



సుండుపల్లె, ఫిబ్రవరి 11: సుండుపల్లె మండలంలోని ఈడిగపల్లె సమీపంలో వెలసిన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలను సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బోనాలు సమర్పించారు. సమీపంలోని మామిడి తోటల్లో అన్నదానం చేశారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 11:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం ఉదయం అమ్మవారికి అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నానది వంతెనకు నోచుకునేనా?





బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోని పెన్నానది (ఇన్‌సర్ట్) బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం

సిద్దవటం, ఫిబ్రవరి 11: తండ్రి ఇచ్చిన హామీలు తనయుడైనా తీరుస్తాడన్న ఆశలు కల్లలుగానే మిగిలిపోయాయని సిద్దవటం మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మాచుపల్లి ఖాదర్ బంగ్లా ప్రాంతంలో పెన్నానదిపై ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన బ్రిడ్జిపనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. అనంతరం సిద్దవటం లోలెవెల్ బ్రిడ్జి కూలిపోవడంతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మించారు. దాన్ని ప్రారంభించేందుకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పెన్నానదిపై మరో రెండు ప్రాంతాల్లో బ్రిడిల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇవేవీ ఆచరణకు నోచుకోలేదు.

సిద్దవటం మండలంలో పెన్నానదికి ఉత్తరం వైపున ఖాదర్ బంగ్లా, జ్యోతి, గొల్లపల్లె, కొత్తపల్లె, పొన్నవోలు, వెంకటాయపల్లె గ్రామాలున్నాయి. ఈ గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రమైన కడపకు వెళ్లాలంటే పెన్నానదిని దాటాల్సి ఉంటుంది. అన్ని సమయాల్లో ఇది సాధ్యమయ్యే పని కాకపోవడంతో వెంకటాయపల్లె, కొత్తపల్లె, పొన్నవోలు, గొల్లపల్లె గ్రామాల ప్రజలు ఆటోల్లో 20 కిలోమీటర్లు ప్రయాణించి సిద్దవటం చేరుకుని, అక్కడి నుంచి బస్సులో మరో 27 కిలోమీటర్ల దూరం ప్రయాణించి కడపకు వెళుతుంటారు. టక్కోలి, పొన్నవోలు వద్ద బ్రిడ్జి నిర్మిస్తే వీరు 10 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణించి కడపకు చేరుకోవచ్చు.. మాచుపల్లి, ఖాదర్ బంగ్లా బ్రిడ్జి నిర్మాణం జరిగితే 15 కిలోమీటర్ల ప్రయాణంతో కడపకు వెళ్లవచ్చు. దీంతో దాదాపు 32 కిలోమీటర్ల దూరం తగ్గిపోవడమే కాకుండా, సమయమూ, డబ్బూ ఆదా అవుతాయి. దీనికి తోడు ఆయా గ్రామాల్లో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలు పరిష్కారమవుతాయి. ఈ నేపథ్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఆయన తనయుడైనా నెరవేరుస్తాడని ప్రజలు ఆశపడ్డారు. అయితే ఆశ నిరాశగా మిగిలిపోయింది.

టీడీపీతోనే యువతకు ఉద్యోగావకాశాలు



లక్కిరెడ్డిపల్లె: సోములవాండ్లపల్లెలో యువతతో రమేష్‌కుమార్‌రెడ్డి



రైల్వేకోడూరు: కర పత్రాలను విడుదల చేసిన కస్తూరి, తదితరులు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 11: టీడీపీ హయాంలో ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని, టీడీపీ మళ్లీ అధికారంలోకి రావాలంటే యువత ఎంతో కృషి చేయాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆర్ రమేశ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మద్దిరేవుల పంచాయతీలో రాచపల్లె, సోములవాండ్ల పల్లెల్లో ఆయన ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇసుక దందా, భూ ఆక్రమణలు పెరిగిపోగా, గ్రామాల్లో అభివృద్ధి శూన్యమన్నారు. ఈ సారి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే గ్రామాలు అభివృసాధిస్తాయన్నారు. .తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నాగేంద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు దేవనాథరెడ్డి, కావలి ఆంజనేయులు, బడుగు వాసు దేవుడు, రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యువత ఓటు మార్పునకు నాంది...

రైల్వేకోడూరు(రూరల్) : యువత ఓటు మార్పునకు నాంది పలుకుతుందని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో షైఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు.

ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు, నూతన పరిశ్రమలు తీసుకువచ్చే విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు బాబు నాయుడుకు ఓటు వేసి ముఖ్యమంత్రి చేయాలని యువతకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి ఐదేళ్లకు 9 నుంచి 10 శాతం యువ ఓటర్లు వస్తున్నారని, వారి ఓటు ద్వారానే ప్రభుత్వం ఏర్పాటు అవుతుందన్నారు. ఏ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నా యువ ఓటర్లతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కొమ్మ శివ, సుకుమార్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



రైల్వేకోడూరు: పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



చిట్వేలి: హోమం కార్యక్రమంలో ఆర్యవైశ్యులు

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 11: పట్టణంలోని పాతబజార్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ పూజలను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం పతాకావిష్కరణతో ప్రారంభించి గణపతి పూజ, నవగ్రహ శాంతి హోమం, పూర్ణాహుతి కన్యక పూజ చేశారు. సాయంత్రం అమ్మవారి ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, ప్రధాన కార్యదర్శి చలపాటి హరినాథ్, మేడా వెంకటసుబ్బయ్య, శ్రీరామ సుబ్రహ్మణ్యం, పెడబల్లె శరత్, కలపాటి శ్రీధర్, చలపతి హరినాథ్ మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిట్వేలి: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినం సందర్భంగా చిట్వేలి అమ్మవారిశాలలో ఆదివారం ఆలయ అర్చకులు, యువకులు ఎండు ఫలాలతో అమ్మవారి రూపాన్ని రూపొందించారు. ఉదయం అభిషేకం, కుంకు మార్చన అగ్నిహోమం, పూజలు నిర్వహించారు. కామిశెట్టి సుబ్రమణ్యం, సుమన్ కోట సుధాకర్, సదానందం, టి.వి.సుబ్రమణ్యం, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి ఉత్సవాలు



పగిడీ పట్టు వస్త్రాల పూజా మహోత్సవంలో లంబాడా, గిరిజన సంఘాల నేతలు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి11: లంబాడీల ఆరాధ్య దేవుడు సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాలను ఆదివారం రాయచోటి పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పగిడీ పట్టు వస్త్రాల పూజ నిర్వహించారు. అనంతరం గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ నాయక్, గణపతి మహరాజ్, లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు శంకర్‌నాయక్, కృష్ణానాయక్‌లు మాట్లాడుతూ ఈకార్యక్రమానికి హథీరాంజీ మఠం తిరుమల తిరుపతి వారు పట్టు వస్త్రాలు పంపించడం ఆనందదాయకమన్నారు. అనంతరం లంబాడీల సాంస్కృతిక నృత్యాలు, వేషధారణ, సంస్కృతి సంప్రదాయాలు, కట్టుబాట్లపై ప్రసంగించారు. తిరుమలలోని హథీరాంజీ మఠంలో లంబాడాలకు ఒక ప్రత్యేక విభాగం ఉండేదని, ప్రభుత్వం ఈ మఠాన్ని నిర్వీర్యం చేయడం లంబాడీల సంస్కృతిని దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా లంబాడాల సంస్కృతి, సంప్రదాయదాయాలు, కట్టుబాట్లను ప్రభుత్వాలు గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ లత, విశ్రాంత తహసీల్దార్ గోవిందనాయక్, శంకర్‌నాయక్, వినోద్‌నాయక్, శంకర్‌నాయక్, సావిత్రి బాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

సుండుపల్లె, ఫిబ్రవరి11: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొండూరు రెడ్డయ్యరాజును ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్స) అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, సెక్రటరీ సింహాలచం ఆదివారం తిరుపతిలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకిత భావంతో విశేష కృషి చేశారని కొనియాడారు. అనంతరం రెడ్డెయ్యరాజు మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి ఫలితంగా ఈ పురస్కారం సాధ్యమైందని ఈ పురస్కారం వారికే అంకితం అని తెలియజేశారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘననివాళి



పండిత్ దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట, ఫిబ్రవరి11 : బీజేపీ సిద్ధాంతకర్త, జనసంఘ్ జాతీయ అధ్యక్షుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి స్థానిక బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతు గుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఏకాత్మ మానవతావాద సిద్ధాంతాన్ని, అంత్యోదయ మంత్రాన్ని అందించి భారతీయ రాజకీయాలకు కొత్త కోణాన్ని ఇచ్చిన గొప్ప తత్వవేత్త, అజాత శత్రువు పండిట్ దీన్‌దయాళ్ అన్నారు. ఆయన స్ఫూర్తితో నేడు అమలు చేస్తున్న పథకాలు దేశంలోని చిట్టచివరి వ్యక్తి వరకు అందే విధంగా బీజేపీ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ కార్యదర్శి పెనుగొండ రమణ, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.హరిప్రసాద్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జి.కె.నాగరాజు, రాజంపేట మండల ఉపాధ్యక్షుడు రేణుప్రసాద్‌రాజు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.సూర్యచంద్ర, ఆర్‌టీఐ సెల్ జిల్లా కన్వీనర్ పి.మహేష్ బాబు, బీజేపీ నాయకులు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జనసేన విజయం తథ్యం



ప్రచారం చేస్తున్న రేవతి

రైల్వేకోడూరు(రూరల) ఫిబ్రవరి 11: మండలంలోని బుడుగుంట పల్లి, సుర్వరాజుపల్లి, ఉర్లగడ్డ పోడు, రాఘవరాజుపురం పంచా యతీలో టీడీపీ యువ మహిళా నాయకురాలు నగిరిపాటి రేవతి ముమ్మర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈసారి టీడీపీ విజయాన్ని ఆపలేరని తెలిపారు. టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని జోస్యం చెప్పారు. రా కదలిరా సభలకు వస్తున్న అశేష జనవాహిని ఇందుకు నిదర్శనమన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్య దర్శి నారా లోకేష్ శంఖారావం కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొంటోందన్నారు. వైసీపీ రాజకీయ రౌడీయిజానికి కాలం చెల్లిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన టీడీపీ సంసిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రానికి టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక అవసరం'

నందలూరు, ఫిబ్రవరి 11: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కలయిక మన రాష్ట్రానికి ఎంతో అవసరమని రాజంపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకుడు మేడా విజయ శేఖర్‌రెడ్డి, భారతీయ జనతా పార్టీ నేషనల్ సెక్రటరీ, మణిపూర్ ఇన్‌చార్జి సాయి రాజు చర్చించుకున్నారు. ఆదివారం మండలంలోని చెన్నయ్యగారిపల్లెలో వారిరువురు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలలో పలు రాజకీయ అంశాలు చర్చించారు. అనంతరం సౌమ్యనాథస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ పూజారులు వారికి ఘనంగా స్వాగతం పలికి పూలమాల, శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. వీరి వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న బూదేల ప్రభాకర్

నందలూరు, ఫిబ్రవరి 11: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిమ్ శిక్షకుడు బూదేల ప్రభాకర్ తెలిపారు. స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూపు 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం యువతకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ఈ పోటీలకు వేదికైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉత్కంఠ భరితంగా సాగిన కబడ్డీ పోటీల్లో నందలూరు వైట్ క్యాట్ టీం విజేతగా నిలువగా శ్రీనివాసరాజు బహుమతి అందజేశారు, ద్వితీయ స్థానంలో నిలిచిన నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టుకు బూదేల వెంకటయ్య, బూదేల సుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రభాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట స్వామాట్, సీనియర్ క్రీడాకారులు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మిడిశెట్టి సుధాకర్, స్కౌట్ గ్రూపు సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాహనదారులకు రికార్డులు తప్పనిసరి



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

నందలూరు, ఫిబ్రవరి 11 : వాహనదారులు ఎల్లప్పుడూ రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ సూచించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లె గ్రామ పరిధిలోని తోటపాలెం, గాంధీ నగర్ ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున ఆయన సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు నేరస్తులు అవుతారని తెలిపారు. అపరిచితులు, అనుమానితులు గ్రామంలో తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని తెలిపారు. ఇళ్లకు తాళం వేసి ఊర్లకు వెళ్లేవారు ముందస్తుగా తమకు సమాచారం ఇస్తే తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్‌లు, పోలీసులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానమే యూటీఎఫ్ ధ్యేయం

పుల్లంపేట, ఫిబ్రవరి 11: పాత పెన్షన్ విధానమే తమ ధ్యేయమని.. దాని సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సాంబశివరావు, జిల్లా కార్యదర్శి రమణ మూర్తి హెచ్చరించారు. మన ఓటు మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆదివారం యూటీఎఫ్ నాయకులు మండలంలోని పలు పాఠశాలల దగ్గర పోస్టర్లు అంటించారు. ఓపీఎస్ అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించేవారికే తమ ఓటు వేస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల ఓట్లు ఓపీఎస్ అమలు చేసేవారికే అనే నినాదం బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి ఉద్యోగి, నిరుద్యోగ యువత ఓట్ ఫర్ ఓపీఎస్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కొట్టం శంకరయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ, శంకరయ్య, లక్ష్మీనరసయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రామాపురం, ఫిబ్రవరి11: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ అయోధ్య పురం నాగభూషణ్‌రెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆదివారం రామాపురం ఎంపీపీ గడికోట విజయలక్ష్మి ఆధ్వర్యంలో తిరుపతికి రామదేవి మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వారు మెగా వైద్య శిబిరంను నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 130 మందికి పైగా పరీక్షలు చేసి, 15 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆరోగ్యశ్రీ కలిగిన వారిని ఆపరేషన్లు ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ ఆంజనేయులు తెలిపారు. ఆవారికి రానుపోను చార్జీలు, భోజనాలు, మందులు ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, డాక్టర్లు వినయ్, వైద్య సిబ్బంది, ఎల్లయ్య పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి, పద్మావతి విగ్రహాల గ్రామోత్సవం



ఆలయ కమిటీ సభ్యులకు విగ్రహాలు అందజేస్తున్న దాతలు

గాలివీడు, ఫిబ్రవరి11: మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణ వీధిలోని ఆలయంలో ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేసిన వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల విగ్రహాలను ఆదివారం గేటు కోదండ రామాలయం నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు ఊరేగించారు. మార్చి 18, 19, 20వ తేదీల్లో ఈ విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు. కాగా, భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కరిమిరెడ్డిగారిపల్లె వాస్తవ్యులు రమణయ్య దంపతులు కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

అంగన్‌వాడీల పోరాటం చిరస్మరణీయం



అంగన్వాడీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి11: సమస్యల సాధన కోసం అంగన్వాడీలు చేసిన పోరాటం చిరస్మరణీయమైందని, కార్మిక వర్గ పోరాటాల చరిత్రలో ఈ ఉద్యమానికి ఒక ముఖ్యమైన స్థానం ఏర్పడిందని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ తెలిపారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రం పరధిలోని శివ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన ఉద్యమ శిక్షణ తరగతుల్లో రెండో రోజు ఆమె మాట్లాడారు. దేశంలో నరేంద్రమోడీ, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విధానాలు, ప్రజల మనోభావాలను భిన్నమైనవన్నారు. సమస్యలను పక్కకు మళ్లించడానికి మతం పేరుతో పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారానికి అంగన్వాడీ కార్యకర్తలు నాయకత్వం వహించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, యూనియన్ గౌరవాధ్యక్షుడు పీ. శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ చంద్రమోహన్; రామాంజులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీలక్ష్మి, రాజేశ్వరి, విజయ, నాగమణి, సుమలత, అరుణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ జాషువా

ఎన్నికల విధులకు సమాయత్తంకండి

● అలసత్వం చూపిస్తే చర్యలు: ఎస్పీ

చిత్తూరు, ఫిబ్రవరి 11: ఎన్నికల విధులకు సమాయత్తం కావాలని ఎస్పీ జాషువా ఆదేశించారు. ఆదివారం పోలీసు అతిథి గృహంలో జరిగిన అధికారుల పరిచయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. పలమనేరు డీఎస్పీగా పనిచేసిన 12 ఏళ్ల తర్వాత ఇక్కడికి ఎస్పీగా రావడం ఆనందంగా ఉందన్నారు. బాధితులు స్టేషన్‌కు వచ్చినప్పుడు వారిని కుటుంబీకుల వలె భావించి న్యాయం చేయాలన్నారు. రెండు రాష్ట్రాలకు సరిహద్దులో జిల్లా ఉండటం వల్ల మద్యం, డబ్బు రవాణా ఎక్కువగా జరిగే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల చెక్‌పోస్టులను మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. నైట్‌బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు అరీఫుల్లా, సుబ్బరాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 11: జగనన్న ఇండ్ల రిజిస్ట్రేషన్లు రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులైనా జరిగాయి. సబ్ రిజిస్ట్రార్లు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి అక్కడి సిబ్బందికి సందేహాలను నివృత్తి చేస్తూ, సహకారం అందించారు. ఈనెల 18వ తేదీ ఆదివారం కూడా రిజిస్ట్రేషన్లు చేయాలని ఆ శాఖ కమిషనర్ రామకృష్ణ సబ్‌రిజిస్ట్రార్లను ఆదేశించారు.

బధిర మహిళపై అత్యాచారయత్నం

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 11: బధిర మహిళ(45)పై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన ఎస్ఆర్‌పురం మండలంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ కోళ్లఫారంలో పనిచేసే బిహార్‌కు చెందిన ఇద్దరు బాలకార్మికులు ఇంటి వద్ద నిద్రిస్తున్న బధిర మహిళ నోరుమూసి అత్యాచారయత్నం చేయబోగా, ఆమె కుమారుడు కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడికొచ్చారు. వీరిని చూసి నిందితులు పారిపోతుండగా ఓ బాలుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కార్వేటినగరం సీఐ సత్తిబాబు ఆదేశాలతో ఎస్ఆర్‌పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. కోళ్లఫారాల్లో పనిచేసే బాలకార్మికులు చాలామంది డ్రగ్స్‌కి అలవాటు పడి.. రాత్రి వేళల్లో ఇటువంటి పనులతోపాటు దొంగతనాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ ఫారాలపై దృష్టిపెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



ధనంజయ మృతదేహం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 11: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. కాణిపాకం ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. ఐరాల మండలం 35యర్లంపల్లె పంచాయతీ గుట్టకిందపల్లెకు చెందిన ధనంజయ(49) తన సొంత పనిపై ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. తిరువణంపల్లె హైవేపైకి రాగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురు చిన్నారులకు ఆర్థికసాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చిన్నారులకు నగదు అందజేస్తున్న పార్థసారథి నాయుడు

కల్లూరు, ఫిబ్రవరి 11: పులిచెర్ల మండలం మంగళంపేట పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన వంశీ, లక్ష్మీదేవి దంపతులు ఆరు నెలల వ్యవధిలోనే ఒకరి తర్వాత ఒకరు మృతి చెందారు. దాంతో వీరి పిల్లలు సౌమ్య(8), హేమలత (5), వివేక్ (2)ల భవిష్యత్తు అంధకారమైంది. ఈ విషాదంపై 'ఎంత కష్టమొచ్చింది?' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై చిత్తూరుకు చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ పార్థసారథి నాయుడు స్పందించారు. ఆదివారం మంగళంపేటకు చేరుకుని సర్పంచ్ మధుతో కలిసి ముగ్గురు పిల్లలుంటున్న ఇంటికి వెళ్లి ఈ ముగ్గురికీ రూ.31,000వేలను అందజేశాడు. ఒక్కో చిన్నారి పేరుపై బ్యాంకులో రూ.10వేల చొప్పున డిపాజిట్ చేయాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 70,158 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,801 మంది తలనీలాలు సమర్పించారు.

వైభవంగా పురశైవారితోటోత్సవం



తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, రామానుజాచార్యుల శిష్యులలో ప్రముఖుడైన అనంతాళ్వారు 970వ అవతారోత్సవం తిరుమలలోని అనంతాళ్వారు తోటలో (పుర్శైవారితోట) ఆదివారం టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతళ్వారు వంశీకులు 'నాలాయిర దివ్యప్రబంధ గోష్ఠిగానం' నిర్వహించారు. తిరుమల పెద్దజీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేస్తూ 102 ఏళ్ల సుదీర్ఘ జీవన ప్రస్థానంలో స్వామి పుష్పకైంకర్యాన్ని ప్రారంభించి, ఉద్ధరించిన శ్రీవైష్ణ భక్తాగ్రేసరుడు అనంతాళ్వార్ అని కొనియాడారు. అనంతాళ్వారు వంశీకులు కొన్ని దశాబ్దాలుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం ముదావహమన్నారు. చిన్నజీయర్ మాట్లాడుతూ తిరుమలలో పుష్పాల తోటను ఏర్పరచి తన జీవితాన్ని భగవంతుడి పాదాల వద్ద పుష్పంగా సమర్పించుకున్నారని అనంతాళ్వార్ జీవిత వైశిష్ట్యం గురించి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో టీటీడీ పరిచారకుడి మృతి



నరసింహన్ (ఫైల్ ఫొటో)



ఘటనా ప్రాంతంలో యతీరాజ నరసింహన్ మృతదేహం

తిరుమల, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో శ్రీవారి ఆలయంలో పని చేసే పరిచారిక మృతి చెందాడు. ఆలయంలోని సబేరాలో పరిచారికగా పని చేసే యతీరాజ నరసింహన్(43) విధులను పూర్తి చేసుకుని ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంలో తిరుపతికి బయలుదేరాడు. 37వ మలుపు వద్ద ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొంది. యతీరాజ నరసింహన్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తిరుపతికి తరలించారు.

జే బ్రాండ్ మద్యం తెచ్చి..

ప్రజల ప్రాణాలతో సీఎం చెలగాటం

- మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పెనుమూరు, ఫిబ్రవరి 11: మద్యపాన నిషేధం చేస్తామని హామీ ఇచ్చి.. జే బ్రాండ్ మద్యం తీసుకొచ్చి.. ప్రజల ప్రాణాలతో సీఎం జగన్ చెలగాటం ఆడుతున్నాడని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. ఈ మద్యాన్ని విస్తరింపచేస్తున్న మంత్రి ఇదే నియోజకవర్గంలో ఉన్నాడని ముందు నారాయణస్వామి, జగన్ తమ బ్రాండ్లను తాగితే అవి ఎలా ఉన్నాయో తెలుస్తుందన్నారు. ఆదివారం పెనుమూరు మండలం పులికల్లు పంచాయతీ గొడుగుమానుపల్లి గ్రామంలో వైసీపీ నుంచి సుమారు 50 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరిలో మహేందర్‌రెడ్డి, పులికల్లు వైసీపీ వార్డు మెంబరు భర్త గోపాలమందడి, సుధాకర్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, దిలీప్, తదితరులున్నారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. ఒక్క అవకాశం అంటూ గద్దెనెక్కిన జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా నిత్యావసరాల ధరలు పెంచి పేదల నడ్డి విరిచారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబునాయుడు, పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రసాద్, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలాగా బ్రోకర్‌ని కాదు

● నారాయణస్వామిపై విరుచుకుపడ్డ థామస్

'ఓ పక్క ఎర్రచందనం దొంగ, మరో పక్క ఇసుక దొంగను పెట్టుకుని వారి నుంచి కమీషన్లు తీసుకుంటూ.. నీలాగా బ్రోకర్ని నేను కాదు.. డాక్టరుగా ఎంతో మందికి సేవ చేస్తున్నా' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై గంగాధరనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జి థామస్ విరుచుకుపడ్డారు. గొడుగుమానుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'నేను చెన్నైకి అడుక్కుతినేదానికి పోయానని ఇష్టం వచ్చినట్లు వాగుతున్న నారాయణస్వామికి సవాల్ విసురుతున్నా.. రాజమన్నార్‌రెడ్డి, చెంగారెడ్డి దగ్గర అడుక్కుతిన్నది ఎవరు? నీదీ ఓ బతుకేనా? నువ్వు రాజకీయాలకు పనికిరాని చెత్తవి. రాబోవు ఎన్నికల్లో ప్రజలు నిన్ను చెత్త బుట్టలో వేస్తారు' అని థామస్ అన్నారు.



టీడీపీలో చేరినవారితో అమరనాథరెడ్డి, థామస్

వరసిద్ధుడికి కానుకగా 14రకాల వెండి హారతులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 11: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి ఆదివారం 14 రకాల వెండి హారతులను కానుకగా అందాయి. వీటిని బెంగళూరుకు చెందిన అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలసి అందజేశారు. వీరిని చైర్మన్ మోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే పూతలపట్టు మండలం గొడుగుచింతకు చెందిన శివప్రసాద్‌రెడ్డి గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,00,000 విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.





వెండి హారతులను అందిస్తున్న దాత - అన్నదానానికి విరాళం అందిస్తున్న దాత

ఆలయంలో నేడు నాగ ప్రతిష్ఠ: వరసిద్ధుడి ఆలయంలో సోమవారం నాగ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. వేకువ జామున నాలుగు నుంచి ఐదు గంటల మధ్య పూర్వాభాద్ర నక్షత్రయుక్త శుభ ధనుర్లగ్నంలో ఈ కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. ఉభయదారులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎస్వీయూలో రూ.16 కోట్లతో హాస్టల్ సముదాయం



పనులను ప్రారంభిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 11: ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ పరిధిలో రూ.16 కోట్లతో హాస్టల్ సముదాయాన్ని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన శంకుస్థాపన ఆదివారం నిర్వహించారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఈ నిధులను సమకూర్చిందన్నారు. 500 మంది విద్యార్థులకు వసతి సామర్థ్యంతో ఈ సముదాయాన్ని నిర్మిస్తామని తెలిపారు. మాజీ వీసీ రాజారెడ్డి పాల్గొన్నారు.

సెమినార్ హాల్ ప్రారంభం

ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో రూ.10 లక్షలతో ఆధునికీకరించిన సెమినార్ హాల్‌ను వీసీ ఆదివారం ప్రారంభించారు. 200 మంది సామర్థ్యంతో ఈ హాల్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ రఘునాథరెడ్డి ఆర్థిక సహకారం అందించినట్టు చెప్పారు.

ఒకే రోజు 89 మందికి కుక్కకాటు

చిత్తూరులో వీధికుక్కల స్వైర విహారం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 11: చిత్తూరులో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఆదివారం ఒక్క రోజే నగరంలోని పలు ప్రాంతాల్లో 89 మందిని కరిచాయి. జెండామాను వీధి, తోటపాళ్యం, సంతపేట, ఇంద్రానగర్, కోర్టు జంక్షన్, ఎంఎస్ఆర్ సర్కిల్, కట్టమంచి, బజారు వీధుల్లోకొచ్చిన వాహనదారులతోపాటు స్థానికులు బాధితులుగా ఉన్నారు. వీరిలో 60 మందిపై ఒకే కుక్క దాడి చేయడం గమనార్హం. బాధితులంతా చిత్తూరు ప్రభుత్వాస్పత్రిల్లో చికిత్స తీసుకున్నారు.

కార్పొరేషన్ లెక్కల ప్రకారమే 50 డివిజన్లలో 4వేలున్నాయి

50 డివిజన్లలో కార్పొరేషన్ లెక్కల ప్రకారమే నాలుగు వేల వీధికుక్కలు ఉన్నట్లు సమాచారం. అయితే స్వచ్ఛంద సంస్థల సర్వే ప్రకారం సుమారు 15వేల కంటే ఎక్కువ ఉన్నట్లు సమాచారం. ఒక్కో వీధిలోనే పది కుక్కల వరకు ఉంటున్నాయి. పది రోజుల కిందట కూడా 13వ డివిజన్ పరిధిలోని మాపాక్షికి చెందిన రామస్వామి యాదవ్ గొర్రెల షెడ్‌లో దూరి సుమారు పది గొర్రెలపై దాడి చేసి, చంపేశాయి. రెండ్రోజుల కిందట మిట్టూరులోని రెడ్‌క్రాస్ వీధిలోని కిడోస్ ప్రీప్రైమరీ స్కూల్ సమీపంలో ఇద్దరు వృద్ధులు వాకింగ్ కోసం మెసానికల్ మైదానానికి వెళ్తుండగా సుమారు 10 వీధి కుక్కలు దాడి చేశాయి. వారు గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి రాళ్లు రువ్వడంతో చిన్న గాయాలతో బయటపడ్డారు. ఇలా శునకాల దాడిలో గాయపడటంతో రోజూ యూపీహెచ్‌సీల్లో, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పదుల సంఖ్యలో కుక్క కాటు కేసులు నమోదు అవుతున్నాయి.

సంఘటన జరిగినప్పుడే అధికారుల హడావుడి

ఏదైనా సంఘటన జరిగినప్పుడే అధికారులు హడావుడి చేస్తారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా నాలుగువేల కుక్కలుంటే 20 కూడా పట్టని ఓ వాహనాన్ని తీసుకొచ్చి ఫొటోలు పోజులిచ్చి వెళ్లిపోతారని వాపోతున్నారు. పైగా ఓ వీధిలో పట్టుకున్న కుక్కలను కూడా మరో వీధిలో విడిచి పెడుతున్నారన్న విమర్శలూ లేకపోలేదు. ఆదివారం కూడా 60 మందిపై దాడి చేసిన కుక్కను పట్టుకున్నట్లు నగరపాలక సంస్థ తెలిపారు. అయితే బాధితులు మాత్రం అది తమను కరిచిన కుక్క కాదని చెబుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కమిషనర్ అరుణ



మిట్టూరులోని కిడోస్ స్కూల్ వద్ద ఉన్న కుక్కల గుంపు

సిరంజులు లేవట

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో సిరంజులు లేవని అక్కడి వైద్య సిబ్బంది చెబుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో చేసేదేమీలేక బయట మెడికల్ షాపునకు వెళ్లి సిరంజి తీసుకొచ్చి వ్యాక్సిన్ వేయించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితులను పరామర్శించిన డీసీహెచ్ఎస్, కమిషనర్

వీధి కుక్కల దాడిలో గాయపడిన వారిని డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, నగరపాలక సంసంస్థ కమిషనరు అరుణ పరామర్శించారు. సిరంజులు, మందులు బయట రాస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తిరుపతి ఉప పోరుకు మరో నలుగురు బలి!

● ఈసీ ఆదేశాలతో ఇద్దరు సీఐలు సహా ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

● వీఆర్‌కు ఇద్దరు సీఐలు ● ఎన్నికల్లో అక్రమాలపై విచారణలో నిర్లక్ష్య పర్యవసానం

● అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ దాటిపోకూడదని ఆదేశం



సీఐలు అబ్బన్న, దేవేంద్రకుమార్, శివప్రసాదరెడ్డి, శివప్రసాద్

తిరుపతి(నేర విభాగం), ఫిబ్రవరి 11: తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి తాజాగా ముగ్గురు పోలీసు అధికారులు, ఓ హెడ్‌కానిస్టేబుల్ సస్పెండ్‌కాగా మరో ఇద్దరు పోలీసు అధికారులు వీఆర్‌కు బదిలీ అయ్యారు.అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా సస్పెన్షన్‌తో మొదలైన కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తాజాగా మరో నలుగురి సస్పెన్షన్‌కు కారణమయ్యాయి.2021వ సంవత్సరంలో జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు ఇతర ప్రాంతాల ఓటర్లను బస్సుల్లో తరలించి మరీ పోలింగ్ చేయించారు.వారికోసం ఏకంగా 34 వేల ఓటరు ఐడీ కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేయించారు.ఈ వ్యవహారాన్నంతటినీ చూసీచూడనట్టు వ్యవహరించిన పోలీసులు ప్రతిపక్షాలు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదు. పైగా కాలక్రమంలో ఆయా కేసులను కొట్టివేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన కేంద్ర ఎన్నికల కమిషన్ దర్యాప్తునకు ఆదేశించింది. పోలీసుల బాధ్యతా నిర్వహణపై దర్యాప్తుచేసిన ఉన్నతాధికారులు పలువురు పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు ఫిర్యాదులపై సక్రమంగా దర్యాప్తు చేయలేదని, ఆరోపణలు వచ్చినవారిని విచారించలేదని నిర్ధారించారు. అలాగే దొంగ ఓట్లపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా దొంగ ఓటర్లకు చెందిన ఎపిక్ కార్డులు, ఆధార్ కార్డులు ఇతర వివరాలను కూడా సేకరించి భద్రపరచాల్సి ఉండగా అవేమీ చేయలేదని కనుగొన్నారు. ఎటువంటి విచారణ లేకుండానే ఆయా కేసులను మూసివేసినట్టు గుర్తించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందుకు బాధ్యులైన పోలీసు అధికారులు, సిబ్బందిపై అనంతపురం రేంజి డీఐజీ చర్యలు తీసుకుంటూ ఆదేశాలు జారీ చేశారు.అప్పట్లో ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేసి ప్రస్తుతం తిరుపతి ఎస్‌బీ సీఐగా పనిచేస్తున్న బీవీ శివప్రసాదరెడ్డి, ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఎ.జయస్వాములు, అప్పట్లో స్టేషన్ రైటర్‌గా పనిచేసిన హెడ్‌కానిస్టేబుల్ కె. ద్వారకనాథరెడ్డి, వెస్ట్ సీఐగా పనిచేసి ప్రస్తుతం సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న శివప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. క్రైమ్ నంబర్ 176/2021 అండర్ సెక్షన్ 171 (ఎఫ్), 188 ఐపీసీ ప్రకారం అప్పట్లో ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ కె. ద్వారకనాథరెడ్డి తప్పుడు సెక్షన్లతో కేసు నమోదు చేశారని, కేసు ఇన్వెస్టిగేషన్ అధికారిగా ద్వారకనాథరెడ్డి ఫిర్యాదుదారుని, సంబంధిత పోలింగ్ అధికారులను, బీఎల్‌ఓలను, నేరం జరిగిన ప్రదేశంలో ఉన్న పోలీసు సిబ్బందిని, పోలింగ్ బూత్‌లో ఉన్న ఇతర ఓటర్లను విచారించడంలో విఫలమయ్యాడని, అలాగే నిందితుల ఓటరు ఐడీ, ఎపిక్‌కార్డులు, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని అందుకుగాను ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు డీఐజీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఎస్ఐ జయస్వాములు నేరం జరిగిన ప్రదేశాన్ని సందర్శించి సాక్షులను విచారిండంలో విఫలమయ్యారని, ఐపీసీ సెక్షన్ 171(ఎఫ్) ప్రకారం నేరాన్ని నిరూపించడానికి సాక్ష్యాలను సేకరించాల్సిందిపోయి ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా కేసుకు సంబంధించిన సెక్షన్ను ఐపీసీ 290కి మార్చుచేసేందుకుగాను న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారని ఉత్తర్వుల్లో వివరించారు. నకిలీ ఎపిక్ కార్డులకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన కేసులో సెక్షన్ మార్చి ఐపీసీ 290 ప్రకారం ఛార్జిషీట్ దాఖలు చేయడం దర్యాప్తు తీరు, నిబద్ధతను శంకించే విధంగా ఉందని పేర్కొన్నారు. ఇక సీఐ బీవీ శివప్రసాదరెడ్డి హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా స్టేషన్‌కు అధిపతి అయినందున కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తూ, కింది అధికారులకు మార్గనిర్దేశం చేయాలి. ఎస్‌హెచ్‌ఓ పూర్తిస్థాయిలో పరిశీలించిన తరువాత మాత్రమే కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా కేసు వాస్తవాలను పరిశీలించి, సేకరించిన సాక్ష్యాల ఆధారంగా దర్యాప్తును ధృవీకరించి, చట్టంలో తగిన సెక్షన్‌కింద ఛార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారంలో అవసరమైన స్థాయిపర్యవేక్షణను అమలు చేయడంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ బీవీ శివప్రసాద రెడ్డి విఫలమయ్యారని డీఐజీ ఉత్తర్వులో పేర్కొన్నారు. అలాగే దొంగ ఓట్లపై నమోదైన ఓ కేసుకు సంబంధించి దర్యాప్తు సక్రమంగా నిర్వహించలేదనే కారణంతో అప్పట్లో తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేసి ప్రస్తుతం సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న సీఐ శివప్రసాద్‌ను కూడా సస్పెండ్ చేశారు. వీరిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్టు, అనుమతి లేకుండా వారు హెడ్‌క్వార్టర్స్ దాటి పోకూడదని డీఐజీ ఆదేశించారు.ఉప ఎన్నిక సమయంలో అలిపిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసుకు సంబంధించి దర్యాప్తు చేయకుండానే కేసును మూసివేశారనే కారణంతో ఇద్దరు సీఐలను డీఐజీ వీఆర్‌కు ఆదేశించారు. అప్పట్లో అలిపిరి సీఐగా పనిచేసి ప్రస్తుతం రేణిగుంట రైల్వే సీఐగా పనిచేస్తున్న దేవేంద్రకుమార్‌ను, ప్రస్తుతం సీఐగా ఉన్న అబ్బన్నను అనంతపురం వీఆర్‌కు బదిలీ చేశారు.



ఎస్ఐ జయస్వాములు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం ఇద్దరికి గాయాలు


రాఘవరెడ్డి (ఫైల్ ఫోటో)

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట, ఫిబ్రవరి 11 : రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా ఇద్దరు గాయపడిన సంఘటన పీటీఎం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లెల పంచాయతీ కాప్పల్లికి చెందిన సురేష్ అనేపేర్లు గల ఇద్దరు వ్యక్తులు శనివారం రాత్రి తమ స్వంత పనుల నిమిత్తం బి.కొత్తకోటకు తమ ద్విచక్రవాహనంలో వెళ్లి వస్తుండగా మల్లెల క్రాస్ సమీపంలోకి రాగానే వాహనంలో పెట్రోల్ అయిపోయింది. దీంతో వారు ద్విచక్ర వాహనాన్ని తోసుకుంటు వస్తుండగా ఇదే మల్లెల పంచాయతీ పెద్దమేకలవారిపల్లెకు చెందిన రాఘవరెడ్డి (45) అనే అతను బి.కొత్తకోట నుంచి తమ స్వగ్రామమైన పెద్దమేకలవారిపల్లెకు వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి వారి మీదకు వేగంగా దుసుకెళ్లడంతో సురేష్‌లు ఇద్దరికి గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం వేగంగా వచ్చి వారిని ఢీకొని పక్కనే ఉన్న కాలువలోకి పడిపోవడంతో రాఘవరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు గమనించి హుటాహుటిన 108 వాహనానికి సమాచారం అందించడంతో హుటాహుటిన వాహనం అక్కడికి చేరుకోగా 108 సిబ్బంది రాఘవరెడ్డి పరీక్షించి అతను మృతి చెందాడని నిర్ధారించారు. గాయపడిన వారిని ఇద్దరిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడున్న స్థానికులు రాఘవరెడ్డి బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని తన స్వగ్రామమైన మల్లెల పంచాయతీ పెద్దమేకలవారిపల్లెలో ఆదివారం రాత్రి దహన క్రియలను పూర్తి చేశారు. మృతుడికి భార్య సులోచన 4సంవత్సరాల కుమార్తె 8నెలల కుమారుడు ఉన్నారు. రాఘవరెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. రాఘవరెడ్డి టీడీపీ పార్టీలో క్రియాశీలకంగా పని చేసే కార్యకర్త కావడంతో పలువురు టీడీపీ నాయకులు వచ్చి నివాళులర్పించారు.

అప్పులతో వస్త్ర వ్యాపారి పరారీ

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

మదనపల్లె, ఫిబ్రవరి 11: మదనపల్లె పట్టణం ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలోని వస్త్ర దుకాణం నడుపుతున్న ఓ వ్యాపారి అప్పులు చేసి పరారయ్యాడు. పెద్దమండ్యం మండలం మందలవారిపల్లెకు చెందిన ఈయన..కొన్నేళ్లుగా పట్టణంలోని ఉంటూ వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. ఇందులోభాగంగా స్థానికంగా వ్యాపారులు, తెలిసిన వారి నుంచి అప్పులు చేశాడు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో దుకాణం మూసివేసి అదృశ్యమయ్యాడు. మదనపల్లె, పెద్దమండ్యం ఏరియాలకు చెందిన వారి నుంచి సుమారు రూ.కోటికిపైగా అప్పు చేసినట్లు చెబుతున్నారు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో దుకాణం మూసివేసి పరారైనట్లు భావిస్తున్నారు. దుకాణం మూతపడటం, ఆయన అందుబాటులో లేకపోవడంతో రుణదాతలకు అనుమానం వచ్చి స్థానికంగాను, స్వగ్రామంలోనూ ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో బాధితులు కొందరు స్థానిక టూటౌన్, పెద్దమండ్యం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఆటో బోల్తా..యువకుడి పరిస్థితి విషమం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 11: ఆటో బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు తీవ్రగాయాలపాలైన సంఘటన గుర్రంకొండ మండలంలో చోటు చేసుకుంది. మదనపల్లె పట్టణం చంద్రాకాలనికి చెందిన మల్లికార్జున(18), వెంకటేశ్ చంద్ర, గణేష్‌లు కలసి గ్రామాల్లో గుజిరి సామాన్లు కొనుగోలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం మల్లికార్జున ఆటో కొనుగోలు చేసి గ్రామాల్లో గుజిరీ సామాన్లు ఆటోలో మదనపల్లెకు తరలించే వారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వారు నలుగురు గుర్రంకొండకు ఆటోలో వెళుతుండగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మల్లికార్జున తలకు తీవ్రగాయాలు కాగా, మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

గుర్రంకొండ, ఫిబ్రవరి 11:జూదరులపై పోలీసులు దాడి చేసి ఆరు మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ బోడ్డిగుట్ట అటవీ ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడులో ఆరు మంది పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.4350 స్వాధీనం చేసుకొనట్లు ఆయన తెలిపారు.

నాటుసారా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 11: గుట్టుచప్పుడు కాకుండా నాటుసారాను బయటి ప్రాంతానికి తీసుకెళుతున్న ఇడగొట్టు రమణ(47)ను అరెస్టు చేసి 10లీటర్ల సారా స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురం మండలం జర్రెవారిపల్లి పంచాయతి వడ్డిపల్లికి చెందిన ఇడగొట్టు రమణ నాటుసారాను తీసుకొని వస్తున్నాడని సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి అతని వద్ద నుంచి నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలం వెలిగల్లుకు చెందిన రమేష్(24) గ్రామ సమీపంలో నాటు సారా విక్రయిస్తుండగా ఆదివారం ఎస్ఐ వెంకటేష్ అరెస్ట్ చేశారు. అతని వద్ద ఉన్న 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మండుతున్న పెద్దకొండ



పెద్దమండ్యం, ఫిబ్రవరి 11: మండలంలోని బండమీద పల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి ఘాట్ పెద్దకొండకు అగంతకులు నిప్పు పెట్టారు. దీంతో కొండ బాగ మంటల్లో కాలుతుండడంతో వృక్ష సంపదతోపాటు మూగ జీవాలు మంటల్లో దహనమైపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులలో మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో వేల ఎకరాలు పచ్చదనం కాలి బూడిద కాగా, అడవిలో అగ్ని జ్వాలలు వెదజ ల్లుతు న్న సమయంలో వన్య ప్రాణుల అరణ్య రోదన చెప్పలేనివని ఆ ప్రాంతవాసులు పులువురు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షకాలంలో అడవీలో పరుచుకున్న పచ్చదనం కాలిపోయి నల్ల బారింది. అడవిలో నిప్పు పశుకాపర్ల పనేనని పలువురు అనుమానులు వ్యక్తం చేస్తున్నారు. అడవి ప్రాంతంలో పచ్చదనం కోసం అభివృద్ధికి లక్షల నిధులు వెచ్చించి పనులు చేస్తున్నా ప్రతి ఏడాది అడవి అగ్నికి ఆహుతి అయితే వన సంపద ఎలా వృద్ధిచెందుతుందని ప్రజలు ప్రశ్నించారు. వెలిగల్లు, బండమీదపల్లి గ్రామాల పరిధిలోని పెద్దకొండ, మార్లకొండ, ముసలిగుట్టల్లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వేసవిలో కొండల్లో మంటలు చెలరేగకుండా అటవీశాఖ సిబ్బంది పర్యవేక్షణ చేపట్టాలని ఇందుకు జిల్లా అటవీ శాఖాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొ ని నిప్పు నుంచి అడవిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

శేష..హంస వాహనాలపై వెంకన్న విహారం


శేష వాహనంపై విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు


హంస వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 11: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామివారు శేష, హంస వాహనాలపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలో ఈ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో బాగంగా రెండో రోజైన ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు ఉదయం శేష వాహనం, రాత్రి హంస వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం 8 గంటల నుంచి శ్రీదేవి భూదేవి సమేతులైన వేంకటరమణ స్వామి వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన శేష వాహనంపై కొలువు దీరి పూజలందుకున్నాడు. అనంతరం మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కాగా ఆలయంలో స్వామి వారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి వారు హంస వాహనంపై కొలువు దీరి పూజలందుకుని అలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. భక్తులు అశేష సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని వాహన సేవలు తిలకించారు. బ్రహ్మోత్సవాల్లో బాగంగా సోమవారం ఉదయం శ్రీవారికి ముత్యపు పందిరి వాహనం, రాత్రికి సింహవాహన సేవలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, అర్చకులు రమేష్ స్వామి, సిబ్బంది నగేష్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణదినం


కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో హోమం చేస్తున్న మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, తదితరులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి11: పట్టణంలోని వాసవీభవన్‌వీధిలో గల కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మారణ దినోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మదనపల్లె ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పూనగంటిఓంప్రకాష్ ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయం నుంచి సామూహికంగా ప్రత్యేకంగా గంగను తెచ్చి వాసవీవీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలో హోమాలు నిర్వహించిన అనంతరం ఓంప్రకాష్ పూర్ణహుతిని అమ్మవారి ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి హోమానికి సమర్పించారు. ఆలయ అర్చకుడు రామచంద్ర అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి వైభవంగా అలంకరించారు. ఆలయంలో కన్యకాపరమేశ్వరీ ఉత్సవ విగ్రహనికి లక్ష్మీపూజలు నిర్వహించి లక్ష్మీపారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పూజాదికార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్యవైశ్యలు, వాసవీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అంకిశెట్టిశ్రీనాథ్, పి.అమరనాథ్, ట్రెజరర్ లక్ష్మీదీపక్, ఉపాధ్యక్షుడు వివికృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

● ఐటీ ప్రొఫెనషల్స్‌కు నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి


బెంగళూరులో కిశోర్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న ఐటీ ప్రొఫెనషల్స్

పీలేరు, ఫిబ్రవరి 11: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను సామాన్యులకు అర్థమయ్యేలా వివరించి వారిని చైతన్యవంతుల్ని చేయాలని బెంగళూరులోని పీలేరు నియోజకవర్గానికి చెందిన ఐటీ ప్రొఫెనషల్స్‌ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని వైదేహీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఆదివారం పీలేరు నియోజకవర్గానికి చెందిన ఐటీ ప్రొఫెనషల్స్ టీడీపీ సంఘీభావ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముందుచూపు కారణంగా నేడు అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో లక్షలాది మంది తెలుగు వారు ఉద్యోగాలు చేస్తూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించారన్నారు. 2019లో చంద్రబాబు గెలిచి ఉంటే రాష్ట్రంలోని యువతకు స్థానికంగా మెరుగైన ఉపాధి అవకాశాలు లభించి ఉండేవని, వైఎస్ రాజశేఖర రెడ్డి మీద అభిమానం, ఒక్క ఛాన్స్ అన్న జగన్ వేడుకోలుతో కరిగిపోయిన రాష్ట్ర ప్రజలు భస్మాసుర హస్తాన్ని నెత్తిన పెట్టుకున్నారన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన జగన్ పాలన, నేటికీ కూల్చివేతలు, కక్షసాధింపులు, అక్రమ కేసులు, సహజ వనరుల దోపిడీ, ప్రశ్నించిన వారిపై దాడులు వంటి వాటితో సాగుతోందన్నారు. చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడిన తెలుగు వారందరూ రాష్ట్రంలో జరుగుతున్న దమనకాండను గర్తించాలని, ఎన్నికలకు ఒక వారం రోజుల ముందు అవసరమైతే తమ ఉద్యోగాలకు సెలవు పెట్టుకుని స్వగ్రామాలకు వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కేవలం తన వ్యక్తిగత కక్ష కారణంగానే జగన్ అమరావతిని చంపేసి రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నవ్వులపాటు చేస్తున్నారన్నారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను, పీలేరులో తనను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. పీలేరుకు చెందిన ఐటీ ఉద్యోగులు మహమ్మద్ రఫీ, మహమ్మ ద్ షఫీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గానికి చెందిన సుమారు 600 మంది ఐటీ ఉద్యోగులు పాల్గొని నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి తమ సంఘీభావం తెలిపారు.

రెడ్డెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 11:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలఅనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు ఆలయానికి వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

మిట్స్ అధ్యాపకుడికి ఐఈఈఈలో గుర్తింపు

కురబలకోట, ఫిబ్రవరి 11: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న కుమార్‌కు ఐఈఈఈ(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్)లో సీనియర్ మెంబర్‌గా అవకాశం దక్కింది. ప్రతిష్టాత్మకమైన ఈ సంస్థ ద్వారా ఇంజనీరింగ్ టెక్నాలజీల లో జరుగుతున్న పరిశోధనలు బాహ్యప్రపంచానికి తెలియజేయడంతో పాటు నూతన పరిశోధనలు చేసే వారికి అవకాశం కల్పించనున్నారు. ప్రతిభ కనబరిచిన అధ్యాపకుడిని కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఈడీ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి రాజశేఖరన్ అభినందించారు.

గుంతలుగా మారుతున్న మోట్లచెరువు

● అక్రమార్కుల దాడిలో తరలిపోతున్న ఎర్రమట్టి

● ఆందోళనలో ఆయకట్టు రైతన్నలు


ఎక్స్‌కవేటర్ సహాయంతో మోట్లచెరువులో మట్టిని తరలిస్తున్న దృశ్యం


నిమ్మనపల్లి, ఫిబ్రవరి 11: నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి పంచాయతీలో మోట్లచెరువు అక్రమార్కుల దాడితో గుంతలమయంగా మారుతోంది. చెరువులోని మట్టిని యథేచ్ఛగా యంత్రాలతో తరలిస్తూ సొమ్ముచేసుకొంటున్నారు. రెండవ శనివారం, ఆదివారం వచ్చిందంటే వారికి పండుగ వాతావరణం నెలకొంటుంది. దాదాపు కొన్ని నెలలుగా అక్రమంగా మట్టితరలిస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. పక్క పొలాల రైతులు మట్టిని తరలించకుండా వారిని అడ్డుకొన్నా ఫలితం లేదని తెలిపారు. కాగా ముష్టూరు పంచాయతికి చెందిన కొందరు యంత్రాల సాయంతో సెలవు దినాలల్లో అధికారులు లేని సమయం లో మట్టి తరలిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు తహసీల్దార్ పదవీ విరమణ చేయడం ఇప్పటి వరకు నూతన తహ సీల్దార్ లేకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారని మండల వాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత వీఆర్వో నాగేశ్వర్ ను వివరణ కోరగా తాము సెలవులో ఉన్నామని వీఆర్ఏను పంపి నిలివేస్తామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూసి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం


ములకలచెరువులో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేత గోపాల్‌రెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 11: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కో ఆపరేటీవ్ సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ములకలచెరువులో బీజేపీ నాయకులు నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే దుకాణదారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జయరామిరెడ్డి, జిల్లా యువ మోర్చా నేత శివ, నాయకులు సోము, శంకర, సహదేవరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ మదనపల్లె అధ్యక్షుడిగా రవికుమార్



మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 11: భారతీయ జనతా పార్టీ మదనపల్లె పట్టణ అధ్యక్షుడుగా బర్నేపల్లె రవికుమార్‌ను నియమిస్తూ రాజంపేట పార్లమెంట్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని, మదనపల్లె బీజేపీ జెండా ఎగరవేస్తామ న్నారు. తన నియామకానికి సహకరించిన రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్‌కు, ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, కృష్ణమూర్తి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కలికిరి మండల అధ్యక్షుడిగా మూర్తి



కలికిరి, ఫిబ్రవరి 11: కలికిరి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడుగా మహల్ గ్రామానికి చెంది న న్యాయవాది టి. మూర్తిని నియమించారు. ప్రస్తు తం ఆయన గుంతకల్లు రైల్వే డివిజన్‌లో కలికిరి రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుడుగా ఉన్నారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం మండల బీజేపీకి సారథ్యం వహించడానికి అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు సాయి కిశోర్, పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరు శ్రీకాంత్, మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మూర్తి పేర్కొన్నారు.

రామసముద్రం అధ్యక్షుడిగా ఆనంద్‌కుమార్



రామసముద్రం, ఫిబ్రవరి 11: రామసముద్రం మండలం కమ్మవారిపల్లికు చెందిన ఇంజమ్ ఆనంద్‌కుమార్‌ను మండల బీజేపీ అధ్యక్షుడుగా నియమించినట్లు జిల్లా పార్టీ అధ్యక్షుడు సాయిలోకేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా మండల అధ్యక్ష పదవి చేపట్టిన ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ తనకు మండల అధ్యక్ష పదవి బాధ్యతను అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్‌కుమార్‌కు, అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

హార్సిలీహిల్స్‌లో భూసంతర్పణ అడ్డుకుంటాం

● టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్


మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 11: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో కోట్ల విలువైన భూమిని జగన్ సర్కారు యాత్ర-2 డైరెక్టర్‌కు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ హెచ్చరించారు. 'హార్సిలీహిల్స్‌కు చేరినయాత్ర' ప్రధాన శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి బాటలో నడుస్తూ క్విడ్‌ప్రోకో తీరున యాత్ర-2 సినిమా డైరెక్టర్ మహీ వి రాఘవకు హార్సిలీహిల్స్‌లో రూ.20 కోట్ల విలువైన భూమిని అప్పనంగా ఇచ్చేందుకు జీవో జారీ చేశారన్నారు. చంద్రబాబు హయాంలో పర్యాటక కేంద్రం, సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తున ఉన్న హార్సిలీహిల్స్‌లో క్రీడాకారులకు శిక్షణ కోసం 3.74 ఎకరాల విస్తీర్ణంలో స్థలం కేటాయించి అభివృద్ధి పనులకు రూ.3.20 కోట్లు కేటాయించగా అందులో రూ. 1.60 కోట్లతో ఈ స్థలం చుట్టూ ప్రహరినిర్మించారన్నారు. యాత్ర-2 డైరెక్టర్ దరఖాస్తు చేసిందే మొదలు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన హార్సిలీహిల్స్‌లోని ఈ భూమిలో 2 ఎకరాలు మినీ స్టూడియో, ఎమ్యూజ్‌మెంట్ పార్కుకు కట్టబెట్టేందుకు రెవెన్యూ అధికారులు ప్రోసీడింగ్స్ ఇవ్వడం, ఆర్డీవో, తహసీల్దార్ సర్వేచేయించి, అలీనేషన్ ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. దీనిపై అఖిలపక్షాలతో పాటు, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో మదనపల్లె సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజన్న, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హిల్స్‌లో మినీ స్టుడియోకు స్థలాన్ని కేటాయిస్తే ఊరుకోం

● రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్

కురబలకోట, ఫిబ్రవరి 11 ఆంధ్ర ఊటీ హార్సిలీ హిల్స్‌లో సీఎం జగన్ తన స్వప్రయోజనాల కోసం మినీ స్టుడియోకు స్థలాన్ని కేటాయిస్తే ఊరుకోబోమని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అంగళ్లులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాత్ర-2 డైరెక్టర్ మహీ-రాఘవన్‌కు గత ప్రభుత్వ హయాంలో స్టేడియంకు కేటాయించిన స్థలంలో రెండెకరాల స్థలాన్ని కేటాయించడం అన్యాయమన్నారు. పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో తన ఇష్టానుసారంగా భూమి కేటాయించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకపోతే అఖిపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

చంద్రబాబు కాపాడితే.. జగన్ దోచేస్తున్నారు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 11: రాష్ట్రం విడిపోయాక సీఎంగా చంద్రబాబునాయుడు ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు కృషి చేస్తే, వైసీపీ పాలనలో జగన్ ప్రభుత్వ ఆస్తులను ఇతరులకు దోచిపెడుతున్నారని రాజంపేట పార్లమెంట్ బీసీ విభాగం అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ధ్వజమెత్తారు. ఆదివారం మదనపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో కోటావూరు పంచాయతీ సర్వే నెంబరు 571/1లోని 3.74 ఎకరాల ప్రభుత్వ భూమిలో 2 ఎకరాలను యాత్ర -2 సినిమా తీసిన డైరెక్టర్ మహీ వి. రాఘవకు మినీస్టూడియో, అమ్యూజ్‌మెంట్ పార్కు ఏర్పాటుకు వైసీపీ ప్రభుత్వం పావులు కదపడాన్ని టీడీపీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఓపీఎస్ అమలును మేనిఫెస్టోలో పెట్టాలి

పీలేరు, ఫిబ్రవరి 11: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్)అమలు చేస్తామంటూ టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉద్యోగులకు ఎంతో ఇబ్బందికరంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయాలని తాము గడిచిన ఎనిమిదేళ్లుగా అనేక ఉద్యమాలు చేస్తున్నామని వారు కిశోర్‌కు తెలిపారు. సీపీఎస్‌లోని లోపాలను గుర్తించిన చంద్రబాబు నాయుడు గతంలో తమకు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ సదుపాయం కల్పించారన్నారు. అయితే 2019 ఎన్నికల ముందు సీపీఎస్‌ను రద్దు చేస్తామని ప్రకటించిన జగన్మోహన్‌రెడ్డి, అధికారంలోకి వచ్చాక దాని గురించి పట్టించుకోకుండా ఉద్యోగులకు మరింత నష్టం చేకూర్చే జీపీఎస్ విధానాన్ని తెచ్చారని ఆయన మాటలు నమ్మిన ఉద్యోగులు తీవ్రంగా మోసపోయారన్నారు. వచ్చే ఎన్నికల సందర్భంగా తయారు చేయనున్న ఎన్నికల మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చేలా చంద్రబాబునాయుడిని ఒప్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్ధరణ అంశాన్ని చంద్రబాబుతో చర్చించి మేనిఫెస్టోలో చేర్చే విధంగా ఒప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జయప్రకాశ్, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పచ్చార్ల సుధాకర్, శ్రీనివాసులు, సభ్యులు రిజ్వాన్, అల్తాఫ్, రమణయ్య, శ్రీధర్, తదిదరులు పాల్గొన్నారు.

సింగిల్ విండోలో ఈకేవైసీ తప్పనిసరి


రైతులతో మాట్లాడుతున్న సొసైటీ పీఏసీ అధ్యక్షుడు దండు కృష్ణారెడ్డి

మదనపల్లె, ఫిబ్రవరి 11: మదనపల్లె సింగిల్‌విండోలో సభ్యత్వమున్న ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేసుకోవడానికి ఆధార్, రేషన్‌కార్డు, భూమి పట్టాదారు పాసుపుస్తం జిరాక్స్ పత్రాలు తప్పకుండా ఇవ్వాలని విండో పీఏసీ ఛైర్మన్ దండు కృష్ణారెడ్డి తెలిపారు. బర్మావీధిలోని సింగిల్‌విండో కార్యాలయంలో ఆదివారం సీఈవో కరుణాకర్‌రెడ్డి, డీసీసీబ్యాంకు ఏజీఎం, డీసీసీబీ సూపర్‌వైజర్ పుష్పలతతో కలసి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విండో పీఏసీ ఛైర్మన్ మాట్లాడుతూ కేంద్రసహకార మంత్రిత్వశాఖ చేపడుతున్న సంస్కరణలో భాగంగా సొసైటీలోని లావాదేవీలన్నీ కంప్యూటరీకరణ, డిజిటలైజేషన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సొసైటీలో సభ్యులు, ఖాతాదారులు, రుణాలు పొందిన, డిపాజిట్ దారులంతా ఈనెల 14వ తేదీలోపల రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, నామినీ ఆధార్‌తో సహా కార్యాలయంలో ఇవ్వాలని కృష్ణారెడ్డి కోరారు.

రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించండి



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ

మదనపల్లె, ఫిబ్రవరి 11: రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. స్థానిక జీఆర్‌టీ స్కూల్‌లో ఆదివారం ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు ఎన్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ రైల్వే రాయితీ సీనియర్ సిటిజన్స్ హక్కుగా పేర్కొన్నారు. ఆ అంశాన్ని సమావేశంలో ఆమోదించి కేంద్ర రైల్వే మంత్రికి వినతిపత్రం పంపనున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్‌సాహెబ్, ఉపాధ్యక్షులు శకుంతలమ్మ, జగన్‌మోహన్, ఆర్గనైజర్ కృష్ణమూర్తి, శ్రీనివాసులు, పరందామగౌడ్, గొల్లపూడి మారుతీరావు, ప్రభాకర్‌మూర్తి, సి.ఇమాన్యుయల్‌రాజ్, అగర్వాల్, రామచంద్రయ్య, కృష్ణకుమార్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


34ఏళ్ల తర్వాత కలసిన పూర్వవిద్యార్థులు

కురబలకోట, ఫిబ్రవరి 11: వారంతా ఒకే చోట విద్యనభ్యసిం చారు..వృత్తి పరంగా వివిధ ప్రాం తాల్లో స్థిరపడి క్షణం తీరిక లేకుండా వారివారి పనుల్లో బిజీబిజీ గా ఉన్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకుని సరదాగా గడిపారు. మండలంలోని కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో 1988-89లో పదోతరగతి వరకు విద్యనభ్యసించారు. వారంతా తాము చదువుకున్న పాఠశాలలో తమ కుటుంబ సభ్యులతో కలసి చిన్నపిల్లల్లాగా సందడి చేశారు. తాము చదువుకున్న రోజులలో గడిపిన అనుభూతులను గుర్తుచే సుకుంటూ తమ స్నేహితులతో కలిసి సరదాగా గడపడంతో పాటు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు చదువులు చెప్పిన గురువులను సన్మానించారు. అంద రూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం సాయంత్రం కేక్ కట్ చేసి సంబ రాలు చుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారామందిస్తామన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

కలకడ, ఫిబ్రవరి 11: స్థానిక జూనియర్ కళాశాల కేంద్రంలో ఇంటర్ రెండవ సంవత్సరం బైపీసీ, ఎంపీసీ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ఎం. రమణయ్య తెలిపారు. ఈ పరీక్షలకు మొదటి రోజు కళాశాలలో చదివే విద్యార్థులతో పాటు సాయి జూనియర్ కాలేజి, ఆదర్శ పాఠశాల నుంచి మొత్తం 42 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కాగా పరీక్ష కేంద్రాన్ని డీఐఈవో కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు.